

ఈ ఏడాది మినుము రైతులు గిట్టుబాటు ధర రాక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మార్చి చివరి వారంలో క్వింటా మినుము రూ.7,800 వరకు ధర పలికింది. రానున్న రోజుల్లో మరింత పెరుగుతుందని ఆశించిన రైతులకు ధర రూ.7000లకు తగ్గిపోవడం ఆందోళన కలిగిస్తోంది. సారవంతమైన భూములు ఉన్న కంకిపాడు, ఉయ్యూరు, పామర్రు, తోట్లవల్లూరు, దివిసీమ ప్రాంతంలోని మండలాల్లో ఎకరానికి సరాసరిన ఆరు నుంచి ఏడు క్వింటాళ్ల దిగుబడి వస్తుందని అంచనా వేస్తే ఈ ఏడాది నాలుగైదు క్వింటాళ్లకే పరిమితమైంది. మినుము తీత పనులను పూర్తి చేసి, మంచి మద్దతు ధర వస్తే విక్రయించేందుకు సిద్ధంగా ఉంచిన సమయంలో ధరలు తగ్గడంపై రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



ఆరబెట్టిన మినుము

ధర లేక దిగాలు

- మినుము క్వింటాకు ప్రభుత్వ మద్దతు ధర రూ.7,400
- రూ.7,000లకే కొనుగోలు చేస్తున్న వ్యాపారులు
- పెట్టుబడి పెరిగి.. దిగుబడి తగ్గి ఇప్పటికే రైతుల డీలా!
- గతేడాది బహిరంగ మార్కెట్లో రూ.7,700 వరకు పలికిన ధర
- ఈ ఏడాది గిట్టుబాటు కూడా కావడం లేదని ఆవేదన

ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం : జిల్లా వ్యాప్తంగా ఈ ఏడాది రబీ సీజన్‌లో 3.50 లక్షల ఎకరాల్లో మినుము పంటను రైతులు సాగు చేశారు. మార్చి నెలాఖరు నాటికి దాదాపు మినుము తీత పనులు పూర్తిచేశారు. మార్చి చివరి వారంలో క్వింటా మినుముకు బహిరంగ మార్కెట్‌లో రూ.7800 వరకు చెల్లించి వ్యాపారులు కొనుగోలు చేశారు. గత 20 రోజులుగా మినుము ధరను వ్యాపారులు క్రమేపీ తగ్గిస్తూ వచ్చారు. ఇంటి అవసరాలు, లేదా గతంలో వ్యవసాయానికి పెట్టిన పెట్టుబడుల నిమిత్తం తీసుకున్న అప్పులను తీర్చేందుకు రైతులు మినుము విక్రయించేందుకు వ్యాపారుల వద్దకు వెళితే క్వింటా మినుముకు రూ.7 వేలకు మించి ధర ఇవ్వలేమని తెగేసి చెబుతున్నారు. గుంటూరు, తెనాలికి చెందిన పెద్ద వ్యాపారులు మినుము ధరను తగ్గించి వేశారని, తమ చేతుల్లో ఏమీలేదని స్థానిక వ్యాపారులు అంటున్నారు.

జిల్లాలో 28 మినుము కొనుగోలు కేంద్రాలు

మార్చి నెల చివరిలో జిల్లాలోని 25 మండలాల్లోని మార్కెట్ యార్డులు, ఇతర ప్రాంతాల్లో 28 మినుము కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశారు. మార్క్‌ఫెడ్ ద్వారా రైతుల నుంచి మినుము కొనుగోలు చేస్తామని జాయింట్ కలెక్టర్ గీతాంజలిశర్మ ప్రకటించారు. మినుము క్వింటాకు మద్దతు ధర రూ.7,400 ప్రభుత్వం ప్రకటించింది. రైతులు తమ వద్ద మినుమును విక్రయించాలంటే ముందస్తుగా ఆర్‌ఎస్‌కేలలో రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని చెప్పారు. రిజిస్ట్రేషన్ పూర్తయిన తర్వాత మినుము శాంపిళ్లను కొనుగోలు కేంద్రాల వద్ద తీసుకువెళితే నాణ్యతను బట్టి ధరను నిర్ణయిస్తామని ప్రకటించారు. మార్చి చివరివారం వరకు మినుము మద్దతు ధర క్వింటాకు రూ.7,800 వరకు వ్యాపారులు బహిరంగ మార్కెట్‌లో కొనుగోలు చేయడంతో రైతులు ఇంకా మినుము ధర పెరుగుతుందనే ఆశతో మినుమును విక్రయించకుండా తమ వద్దనే నిల్వ పెట్టారు. కొద్దిరోజులుగా మినుము ధరను రూ.7 వేలకు వ్యాపారులు తగ్గించి వేయడంతో రైతుల్లో ఆందోళన మొదలైంది.

తగ్గిన దిగుబడి.. పెరిగిన ఖర్చు

రైతులు అన్ని జాగ్రత్తలు తీసుకుని మినుము పంటను సాగు చేస్తే ఎకరానికి కనీసంగా ఆరు క్వింటాళ్లు, అధికంగా ఎనిమిది క్వింటాళ్ల వరకు దిగుబడి వస్తుంది. ఈ ఏడాది పంట సాగుకాలం కొంతమేర అనుకూలించకపోవడంతో అన్ని మండలాల్లో ఎకరానికి నాలుగైదు క్వింటాళ్లకు మిగతా 6లో..

ఖాళీగా మినుము కొనుగోలు కేంద్రాలు

ప్రభుత్వం ఏర్పాటు చేసిన మినుము కొనుగోలు కేంద్రాల్లో నాణ్యత పేరుతో అనేక ఆంక్షలు విధించడంతో రైతులు తమ వద్ద ఉన్న పంటను విక్రయించేందుకు ముందూ, వెనుక ఆలోచిస్తున్నారు. దీంతో ఇప్పటివరకు ఒక్క క్వింటా మినుమును కూడా ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల ద్వారా కొనలేదు. ఇక్కడ మద్దతు ధరకు కొనుగోలు చేస్తే బహిరంగ మార్కెట్‌లో ధర మరింతగా పెరుగుతుందని రైతులు అంటున్నారు. పెసలు కొనుగోలు చేసేందుకు జిల్లాలో ఎనిమిది కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఇప్పటి వరకు 800 టన్నుల పెసలను కొనుగోలు చేసినట్లు మార్క్‌ఫెడ్ అధికారులు చెబుతున్నారు. పెసలు క్వింటాకు మద్దతు ధర రూ.8,682 ప్రభుత్వం నిర్ణయించింది. బహిరంగ మార్కెట్‌లో క్వింటా రూ.8 వేలు మాత్రమే పలుకుతుండటంతో రైతులు ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో విక్రయించేందుకు ఆసక్తి చూపుతున్నారు.

ప్రైవేటు ట్రావెల్స్ దందా!

- సీజన్లలో పెంచేస్తున్న టికెట్ ధరలు
- ఫిట్‌నెస్ లేని బస్సులతో రాకపోకలు
- మార్గమధ్యలో మొరాయిస్తున్న సర్వీసులు
- ప్రశ్నిస్తున్న ప్రయాణికులపై దురుసు ప్రవర్తన
- పట్టించుకోని రవాణా శాఖ అధికారులు

ఉమ్మడి కృష్ణాజిల్లాలో ప్రైవేటు ట్రావెల్స్ బస్సుల దందా నడుస్తోంది. పండగలు, పెళ్లిళ్ల సీజన్, వేసవి సెలవుల్లో టికెట్ ధరలు ఒక్కసారిగా పెంచేస్తున్నారు. కేవలం సీటుకే సుమారు పదిహేను వందల రూపాయల నుంచి రెండు వేల వరకు దండుకుంటున్నారు. ఫిట్‌నెస్ లేని బస్సులను నడపటంతో అవి ఎక్కడపడితే అక్కడ మొరాయిస్తున్నాయి. ఆ సమయంలో ప్రత్యామ్నాయ సర్వీసు ఏర్పాటు చేయాల్సి ఉన్నా యాజమాన్యాలు నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నాయి. ఇదేంటని ప్రశ్నించిన ప్రయాణికులపై ట్రావెల్స్ సిబ్బంది దురుసుగా ప్రవర్తిస్తున్నట్లు విమర్శలు వినిపిస్తున్నాయి.



విజయవాడ, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కృష్ణాజిల్లాలో సుమారు 30 వరకు ప్రైవేటు ట్రావెల్స్ సంస్థలు ఉన్నాయి. వీటి పరిధిలో 500 వరకు సర్వీసులు నడుస్తున్నాయి. రాష్ట్ర వ్యాప్తంగా పలు జిల్లాలకు విజయవాడ కేంద్రంగా ప్రయాణికులను చేరవేస్తున్నాయి. విజయవాడ - విశాఖపట్నం, విజయవాడ - హైదరాబాద్‌కు సాధారణ రోజుల్లో ఐదు వందల నుంచి ఏడు వందల రూపాయల వరకు ధరలు ఉంటాయి. అయితే సీజన్లలో మాత్రం ఈ ధరలు సాధారణ రోజుల్లో కంటే రెండు, మూడింతలు ఎక్కువగా ఉంటాయని ప్రయాణికులు చెబుతున్నారు. అదే దూరం అదే బస్సుకు ఎందుకంత డబ్బు వసూలు చేస్తున్నారో అర్థం కావడం లేదని అంటున్నారు. ధరలను నియంత్రించాల్సిన అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తుండడంతో ప్రైవేటు ట్రావెల్స్ ఆగడాలకు అడ్డులేకుండా పోయిందని విమర్శలు వినిపిస్తున్నాయి. బస్సు సీట్లకు కవర్లు కూడా ఉండవని, కనీసం శుభ్రపరిచే పరిస్థితి కూడా లేకపోవడంతో అనేక బస్సుల్లో సీట్లు మిగతా 6లో..

ఇద్దరు బిడ్డలతో సహా దంపతుల ఆత్మహత్యాయత్నం

- పరిస్థితి విషమం.. విజయవాడ ప్రభుత్వాస్పత్రికి తరలింపు
- సమీప పొలం యజమాని బంధువు, కౌలు రైతు వేధింపులే కారణమని ఆరోపణ
- కంటతడిపెట్టిస్తున్న చిన్నారుల వీడియో సందేశం



భార్య, బిడ్డలతో దుర్గాప్రసాద్(ఫైల్)

పామర్రు, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): రోడ్డు పక్కన ఇరిగేషన్ పోరంబోకు స్థలంలో ఏడాదిగా బడ్డీకొట్టు ఏర్పాటు చేసుకుని జీవనం సాగిస్తున్న ఎస్టీ సామాజికవర్గానికి చెందిన దంపతులు ఇద్దరు బిడ్డలతో సహా ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన పామర్రు మండలం జుజ్జవరం గ్రామంలో మంగళవారం తెల్లవారుజామున జరిగింది. బడ్డీకొట్టు తొలగించాలంటూ సమీప పొలం యజమాని బంధువు, సాగు చేస్తున్న కౌలు రైతు తిరుపతిరావు వేధింపులే దీనికి కారణమని బాధిత కుటుంబం పెట్టిన వీడియో ద్వారా స్పష్టమవుతోందని పోలీసులు తెలిపారు. వివరాల్లోకి వెళితే... లారీ డ్రైవర్ అయిన పేరం దుర్గాప్రసాద్ (36), లక్ష్మీ తిరుపతమ్మ (34) దంపతులకు నాగవల్లి(13), హర్షిత(9) సంతానం. దుర్గాప్రసాద్‌కు రోడ్డు ప్రమాదంలో కాళ్లు దెబ్బతినడంతో హిందూ శ్మశాన వాటిక సమీపంలో రహదారి పక్కన ఇరిగేషన్ పోరంబోకు స్థలంలో బడ్డీకొట్టు పెట్టుకుని హోటల్ నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నారు. కాల్వకు మరోవైపు గల మెట్ట పొలం కౌలు రైతు తిరుపతిరావు.. విజయవాడలో నివాసం ఉండే ఆ పొలం యజమాని బంధువుతో కలసి బడ్డీకొట్టు తొలగించాలంటూ దుర్గాప్రసాద్ కుటుంబాన్ని వేధింపులకు గురిచేస్తున్నారు. వారి వేధింపులను భరించలేక బిడ్డలతో కలిసి మంగళవారం ఉదయం పచ్చగడ్డి నివారణకు వినియోగించే గైసిల్ మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. బడ్డీకొట్టు వెనుకభాగంలో అపస్మారక స్థితిలో పడి ఉన్న వీరిని టిఫిన్ కోసం వచ్చిన గ్రామంలోని రైతులు గమనించి 108లో బందరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో మెరుగైన చికిత్స కోసం విజయవాడ ప్రభుత్వాస్పత్రికి పంపారు.

ఏడుస్తూ పెద్దమ్మ, పెద్దనాన్నకు సెల్ఫీ వీడియో

ఆత్మహత్యాయత్నానికి ముందు దుర్గాప్రసాద్ కుమార్తెలు నాగవల్లి, హర్షిత కన్నీటిపర్యంతమవుతూ సెల్ఫీ వీడియో తీసుకుని పెద్దమ్మ, పెద్దనాన్నలకు పంపించారు. అందులో "తమ్ముడు తేజ.. బాగా చదువుకుని పెద్దవాడివై.. పెదనాన్న, పెద్దమ్మలతోపాటు అక్కను బాగా చూసుకో.. తాము ఇక్కడ గ్రామంలో వేధింపులు భరించలేక మిమ్మల్ని విడిచి వెళ్లిపోతున్నాం.. ఏమీ అనుకోకండి.. సారీ.. ప్లీజ్‌రా తమ్ముడు.. తాము చనిపోయిన తర్వాత అందరికి ఒకే చోట దహన సంస్కారాలు చేయండి" అంటూ ఏడుస్తూ పెట్టిన వీడియో అందర్ని కంటతడి పెట్టించింది. ఆస్పత్రి నుంచి వచ్చిన సమాచారం మేరకు పామర్రు ఎస్సై రాజేంద్రప్రసాద్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



కుటుంబంతో కలిసి దుర్గాప్రసాద్ ఉండేది ఇక్కడే



ఆగని ఇసుక దుమారం!

టెండర్లను రద్దుచేసే కుట్ర

- సిండికేట్ రింగ్ బాగోతం బయటపడటంతో తెరవెనుక పన్నాగాలు
- రాష్ట్రేతర కాంట్రాక్టర్ల ప్రయోజనం కోసమే అధికారుల ఆలోచనలు
- టెక్నికల్ బిడ్లలో తిరస్కరించని అధికార యంత్రాంగం
- ఇతర రాష్ట్రాలకు చెందిన సంస్థలని తెలిసి కూడా పాస్
- తాజాగా టెండర్లను రద్దు చేసేసి.. మళ్లీ పిలిచే యోచన
- ఈసారి అస్మదీయులకు మేలు చేసేలా నిబంధనల మార్పు

ఇసుక టెండర్ల వివాదం రోజుకో దుమారం రేపుతోంది. ఈ టెండర్లలో స్థానికేతర సంస్థలు ఇష్టానుసారంగా పాల్గొనగా, ఇప్పుడు సదరు సంస్థలను కాపాడేలా అధికార యంత్రాంగం ప్రయత్నాలు చేస్తుండటం అనుమానాలకు తావిస్తోంది. అస్మదీయ సంస్థలకు లబ్ధి చేకూరలేదన్న ఉద్దేశంతో ఏకంగా టెండర్లనే రద్దుచేసే కుట్ర జరుగుతుండటం, రద్దు చేస్తున్నట్టు ముందే లీకులు విడుదల చేయడం ఈ విషయాన్ని ధ్రువీకరిస్తోంది.

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : ఇసుక టెండర్ల రచ్చ చల్లారకపోగా, మరింత వివాదాస్పదమవుతోంది. కృష్ణాజిల్లాలోని పామర్రు, పెనమలూరు మండలాల పరిధిలోని చోడవరం, రొయ్యూరు, నార్త్ వల్లూరు, లంకపల్లి ఇసుక క్వారీలకు పిలిచిన టెండర్లపై మరింత దుమారం రేగుతోంది. నిబంధనలకు విరుద్ధంగా టెండర్లు వేసిన సంస్థలపై అనర్హత వేటు వేయకపోగా, అసలు టెండర్లనే రద్దు చేయాలని చూడటంపై ఆరోపణలు గుప్పుమంటున్నాయి. సిండికేట్ అయిన కాంట్రాక్టు సంస్థల కనుసన్నల్లో జిల్లా అధికారులు పనిచేస్తున్నారన్న అనుమానాలకు బలం చేకూరుస్తున్నాయి.

స్థానికేతర సంస్థలకు వత్తాసు

ఈ టెండర్లలో నిబంధనలకు విరుద్ధంగా స్థానికేతర సంస్థలు పాల్గొనటం ఓ ఎత్తయితే, ఆ సంస్థలను కాపాడేలా అధికారులు వ్యవహరించటమే ఈ వివాదాలన్నింటికీ కారణం. పొరుగు రాష్ట్రాలకు చెందిన పలు సంస్థలు స్థానికతతో సంబంధం లేకుండా టెండర్లలో పాల్గొన్న విషయాన్ని జిల్లా యంత్రాంగం కూడా గుర్తించింది. నిబంధనల ప్రకారం.. ఆ సంస్థల టెక్నికల్ బిడ్లను తెరిచిన క్రమంలోనే పక్కన పెట్టాలి. కానీ, వాటిని పాస్ చేశారు. ఈ బాగోతం బహిర్గతమయ్యాక కూడా జిల్లా యంత్రాంగం చర్యలకు ఉపక్రమించలేదు. పైగా టెండర్లను రద్దు చేస్తున్నట్టు లీకులు ఇస్తోంది. జిల్లాకు చెందిన స్థానిక సంస్థల ఆగ్రహాన్ని తాత్కాలికంగా చల్లార్చటం, అస్మదీయ సంస్థలను కాపాడుకోవటం కోసమే అధికారులు ఇలా చేస్తున్నారనే మాటలు వినిపిస్తున్నాయి. టెండర్లను పూర్తిగా రద్దు చేసేసి, తర్వాత అస్మదీయ సంస్థలకు అనుగుణంగా నిబంధనలను మార్చేసి మళ్లీ టెండర్లు పిలవాలని చూస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి.

ఆ కంపెనీలు ఎక్కడి నుంచి వచ్చాయి?

ఇసుక టెండర్లలో కొన్ని సంస్థలు స్థానికంగా ఫర్మ్ రిజిస్ట్రేషన్ లేకుండా పాల్గొన్నాయి. ఇవి వేరే రాష్ట్రాల్లో వాటి ఫర్మ్ రిజిస్ట్రేషన్స్ చేసుకున్నట్టుగా తెలుస్తోంది. టెండర్లలో స్థానిక జిల్లాకు సంబంధించిన సంస్థలే పాల్గొనాలన్న నిబంధన ఉన్నప్పుడు ఇతర రాష్ట్రాలకు చెందిన సంస్థలకు ఎలా ప్రవేశం కల్పించారన్నదే వివాదాస్పదంగా మారుతోంది.

జీఎస్టీలు మార్చిన విషయాన్ని మరిచారా?

ఇసుక టెండర్లలో స్థానికత అని చూపటానికి కేవలం జీఎస్టీలను తాత్కాలికంగా మార్చారు. వాటి ఫర్మ్ స్థానికేతరంగా ఉన్నపుడు అప్పుడైనా అనుమానించి అధికారులు పక్కన పెట్టాలి. కానీ, అధికారులు ఆ పని చేయలేదు. ఇక్కడ కూడా తప్పు జరిగింది. జీఎస్టీలు అవసరాన్ని బట్టి అడ్రస్ మార్చుకోవటం సహజమే అయినా, సంస్థ స్థానిక హోదాను మిగతా 6లో..

టెక్నికల్ బిడ్లలో ఎందుకు పాస్ చేశారు?

టెండర్ల ప్రక్రియలో ముందుగా టెక్నికల్ బిడ్లను తెరుస్తారు. ఆ తర్వాతే ఫైనాన్షియల్ బిడ్లను తెరుస్తారు. అర్హతల ప్రకారం వేశారా, లేదా అనే దానికి టెక్నికల్ బిడ్ల పరిశీలన కొలమానంగా భావిస్తారు. ఈ పరిశీలనలోనే స్థానికేతర సంస్థలను పక్కన పెట్టాలి. కానీ, వాటిని పాస్ చేశారు. టెక్నికల్ బిడ్లను పాస్ చేశారంటేనే తప్పు జరిగిందని అర్థమవుతుంది. అర్హత లేని సంస్థలను టెక్నికల్ బిడ్లలో పాస్ చేయటంపై ముందుగా జిల్లా యంత్రాంగం వివరణ ఇవ్వాలి. కానీ, దీనిపై ఇప్పటి వరకు ఎలాంటి వివరణ రాలేదు.



గ్రామాలకు సురక్షిత తాగునీరు అందిస్తాం

6 • మంత్రి కొల్లు రవీంద్ర

ప్రకృతి విపత్తుల సమయంలో అప్రమత్తంగా ఉండాలి

• కలెక్టర్ బాలాజీ 6

ఆర్‌ఎఫ్‌పీ విడుదల

- టెక్నో ఎకనమిక్ ఫీజిబిలిటీ రిపోర్టు (టీఈపీఆర్) కోసం కన్సల్‌టెంట్ నియామకానికి శ్రీకారం
- ఆర్‌ఎఫ్‌పీ విడుదల చేసిన ఏపీఏడీసీఎల్..
- ఎంపిక చేసిన కన్సల్‌టెంట్‌కు 32 వారాల గడువు
- ఇన్నర్, అవుటర్ రింగ్ రోడ్డు మధ్య ప్రాంతంలో గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్టు!

వాయు 'వేగం'గా..

అమరావతి గ్రీన్ ఫీల్డ్ ఎయిర్‌పోర్టు



విజయవాడ, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): అమరావతి గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్టుకు టెక్నో ఎకనమిక్ ఫీజిబిలిటీ రిపోర్టు (టీఈపీఆర్) రూపకల్పనకు కన్సల్‌టెంట్ కోసం ఏపీ ఎయిర్‌పోర్ట్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఏపీఏడీసీఎల్) రిక్వెస్ట్ ఫర్ ప్రపోజల్ (ఆర్‌ఎఫ్‌పీ)ను విడుదల చేసింది. రాజధాని అమరావతిలో ఐదు వేల ఎకరాలలో గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్టును నిర్మించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకున్న నిర్ణయం నేపథ్యంలో ఏపీఏడీసీఎల్ అధికారులు టీఈపీఆర్ కోసం కన్సల్‌టెంట్ నియామకానికి శ్రీకారం చుట్టింది. రాజధాని అమరావతిలో ఎయిర్‌పోర్టు కోసం అవుటర్, ఇన్నర్ రింగ్ రోడ్డు మధ్య ప్రాంతంలో భూములను సమీకరించాలని ప్రభుత్వం ఆలోచన చేస్తోంది. ఈ దశలో సాంకేతిక, ఆర్థిక, సాధ్యాసాధ్యాల నివేదిక (టీఈపీఆర్)ను రూపొందించటానికి శ్రీకారం చుట్టడంతో శరవేగంగా అమరావతి గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్టుకు అడుగులు పడుతున్నాయి. అమరావతి గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్టు ఎక్కడ ఏర్పాటు చేయాలన్న దానిపై కూడా రిపోర్టులో కన్సల్టెన్సీ పొందుపరచాల్సి ఉంటుంది. సమగ్ర రిపోర్టు ఇవ్వటానికి కన్సల్టెన్సీ సంస్థకు 32 వారాల సమయాన్ని ఏపీఏడీసీఎల్ ఇస్తోంది. ఆసక్తి కలిగిన కన్సల్టెన్సీలు చేయాల్సిన సర్వేలపై కూడా ఆర్‌ఎఫ్‌పీలో సమగ్ర వివరాలను పొందుపరచటం జరిగింది. ముందుగా అమరావతి గ్రీన్ ఫీల్డ్ ఎయిర్‌పోర్టుకు సంబంధించి ప్రీ ఫీజిబిలిటీ స్టడీ చేయాల్సి ఉంటుంది. ఆ తర్వాత టెక్నో ఎకనమిక్ ఫీజిబిలిటీ స్టడీ నిర్వహించాల్సి ఉంటుంది. దీని తర్వాత 'ఎయిర్‌పోర్టుకు సైట్ క్లియరెన్స్ ఎక్కడైతే ఇచ్చారో ఆ ప్రాంత భూమికి సంబంధించి కూడా సమగ్ర వివరాలు అందించాల్సి ఉంటుంది. విమానాశ్రయ ప్రతిపాదిత స్థలానికి సంబంధించి కూడా మిగతా 6లో..



8

రైతుల కష్టం.. దళారుల భోజ్యం!

దివి ప్రాంతంలో ఏఐఐబీ ప్రతినిధుల పర్యటన

8

మాకు రేషన్ ఇవ్వలేదు

8 • లబ్ధిదారులు ఆందోళన



ఇంద్రకీలాద్రిపై అభివృద్ధి పనులు పరిశీలిస్తున్న అధికారులు

ఇంద్రకీలాద్రిపై అభివృద్ధి పనుల పరిశీలన

ఇంద్రకీలాద్రి, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి) : ఇంద్రకీలాద్రిపై జరుగుతున్న అభివృద్ధి పనులను మంగళవారం అధికార బృందం పరిశీలించింది. దేవదాయ శాఖ కమిషనర్, దుర్గగుడి ఈవో కె.రామచంద్ర మోహన్, కనకదుర్గా దేవస్థానం మాస్టర్ ప్లాన్ అమలు ప్రధాన సలహాదారు, ఇంజనీరింగ్ నిపుణుడు కొండలరావు, దేవదాయశాఖ చీఫ్ ఇంజనీర్ శేఖర్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్స్ కోటేశ్వరరావు, వైకంఠరావులు నూతనంగా నిర్మిస్తున్న ప్రసాదం పోటు, అన్న ప్రసాద భవనం, తదితర నిర్మాణాలను పరిశీలించారు. ఇంద్రకీలాద్రి సమగ్ర అభివృద్ధికి, భక్తులకు అన్ని రకాలుగా సదుపాయాలు కల్పించి, సులభతరంగా దుర్గామల్లేశ్వరుల దర్శనం కల్పించేందుకు త్వరితగతిన అమలు పరిచేందుకు ఈ క్షేత్రస్థాయి పర్యటన చేశారు.



కలెక్టర్ లక్ష్మీశ కుటుంబసభ్యులకు దుర్గమ్మ చిత్రపటం అందజేస్తున్న ఆలయ అధికారులు

కనకదుర్గమ్మను దర్శించుకున్న కలెక్టర్ లక్ష్మీశ

వన్‌టౌన్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి) : ఇంద్రకీలాద్రి, దుర్గామల్లేశ్వర దేవస్థానంలో కనకదుర్గమ్మను మంగళవారం ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ జి.లక్ష్మీశ కుటుంబసభ్యులతో కలిసి దర్శించుకున్నారు. ఆయనకు అధికారులు ఆలయ మర్యాదలతో అమ్మవారి దర్శనం కల్పించారు. వేద పండితులు వేద ఆశీర్వచనం అనంతరం ఆలయ అధికారులు లడ్డూ ప్రసాదం, అమ్మవారి చిత్రపటం, శేషవస్త్రం అందజేశారు.



గుండుపాలెంలో మైక్రో వాటర్ ఫిల్టర్‌ను ప్రారంభిస్తున్న మంత్రి రవీంద్ర

గ్రామాలకు సురక్షిత తాగునీరు అందిస్తాం

» మంత్రి కొల్లు రవీంద్ర

మచిలీపట్నం టౌన్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి) : గ్రామాల్లో ప్రజలకు శుద్ధి చేసిన సురక్షితమైన మంచినీటిని సరఫరా చేసేందుకు కృత నిశ్చయంతో ఉన్నామని మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. బందరు మండలం రుద్రవరం, గుండుపాలెం, వాడపాలెం గ్రామాల్లో నిర్మించిన మైక్రోవాటర్ ఫిల్టర్లను మంత్రి మంగళవారం ప్రారంభించారు. రూ.13 లక్షల వ్యయంతో నిర్మించిన మైక్రో ఫిల్టర్లను, కెపిటిపాలెంలో పునరుద్ధరించిన పంచాయతీ కార్యాలయాన్ని మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, సీఎం చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌లు గ్రామాల్లో తాగునీటి సమస్య లేకుండా చేయాలనే సంకల్పంతో ఉన్నారన్నారు. బందరు మండలంలో రూ.2.50 కోట్లతో మైక్రో ఫిల్టర్లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. త్వరలో జలజీవన్‌మిషన్ ద్వారా కృష్ణానది నుంచి నేరుగా మచిలీపట్నంకు నీరు తీసుకువస్తామని, ఇంటింటికీ కుళాయిలు ఏర్పాటు చేస్తామన్నారు. ఉద్యోగులకు సౌకర్యంగా ఉండేందుకు పంచాయతీ కార్యాలయాలను పునరుద్ధరిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో వెంకటేష్, ఆర్‌డబ్ల్యుఎస్ ఈఈ జి.నాగరాజు, పంచాయతీరాజ్ ఏఈఈ హరిబాబు, పీఆర్డీ పీవో బాలకృష్ణ, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి బండి రామకృష్ణ, జిల్లా వ్యవసాయ మార్కెట్ యార్డు కమిటీ అధ్యక్షుడు కుంచే నాని, కాగిత వెంకటేశ్వరరావు, గోపు సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు. శానిటేషన్ సిబ్బందిని మంత్రి సత్కరించారు.

ప్రకృతి విపత్తుల సమయంలో
అప్రమత్తంగా ఉండాలి

» కృష్ణా జిల్లా కలెక్టర్ బాలాజీ

మచిలీపట్నం, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి) : ప్రకృతి విపత్తులు సంభవించినపుడు అధికారులు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ బాలాజీ అన్నారు. కలెక్టర్ చాంబర్‌నుంచి మంగళవారం అధికారులతో వర్చువల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, తీరప్రాంతంలో భారీవర్షాలు, తుపానులు, వరదలు, ఇతరత్రా ప్రకృతివైరీత్యాలు సంభవించిన సమయంలో గత అనుభవాలను దృష్టిలో పెట్టుకుని, వాటిని ఎదుర్కొనేందుకు ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికను రూపొందించాలన్నారు. కృష్ణానదికి భారీ వరదలు వస్తే కరకట్ట ఎంతమేర తట్టుకోగలదనే అంశాన్ని పరిశీలించాలన్నారు. తుపానుల సమయంలో వివిధ ప్రాంతాల్లో సహాయక శిబిరాలను ఏర్పాటుచేసే భవనాలను అధికారులు పరిశీలించి పరిస్థితులను అంచనా వేయాలన్నారు. భవనాలకు ఏమైనా మరమ్మతులు చేయాల్సి వస్తే అందుకు సంబంధించిన నివేదికలను తయారుచేసి తనకు పంపాలన్నారు. సమావేశంలో డీఆర్వో కె.చంద్రశేఖర్, మచిలీపట్నం, గుడివాడ, ఉయ్యూరు ఆర్డీవోలు కె.స్వాతి, బాలసుబ్రహ్మణ్యం, హేలా షారోన్ అధికారులు పాల్గొన్నారు.

జిల్లాలో అక్రమ తవ్వకాలను అరికట్టండి

» కలెక్టర్ బాలాజీకి వైసీపీ నేతల వినతి

మచిలీపట్నం, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో పలుచోట్ల ఇసుక, మట్టి, బుసక అక్రమతవ్వకాలు జరుగుతున్నాయని, వాటిని అరికట్టేందుదుకు తగు చర్యలు తీసుకోవాలని జిల్లాకు చెందిన వైసీపీ నాయకులు మంగళవారం కలెక్టర్ బాలాజీని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వైసీపీ జిల్లా అధ్యక్షుడు పేర్నినాని మాట్లాడుతూ, జిల్లాలో రాత్రి, పగలు తేడా లేకుండా మట్టి, ఇసుక, బుసక తవ్వి విక్రయించేస్తున్నారన్నారు. దివిసీమ ప్రాంతానికి సాగు, తాగునీటిని అందించే పులిగడ్డ ఆక్విడెక్టు పిల్లర్ల చుట్టూ ఇసుకను తవ్వేస్తున్నారని, ఆక్విడెక్టుకు భవిష్యత్తులో ప్రమాదం పొంచి ఉందన్నారు. బందరులోని ముడా భూములు 600 ఎకరాల్లో పెద్దఎత్తున బుసకను తవ్వి విక్రయాలు జరుపుతున్నారన్నారు. పామర్రు మండలాల్లో కృష్ణానది నుంచి ఇసుకను తరలిస్తున్నారని అధికారులకు ఫిర్యాదుచేస్తే ఏమీ చేయలేమని అంటున్నారని అన్నారు. గుడివాడలో బుడమేరు మట్టిని విక్రయిస్తున్నా అధికారులు తమ పరిధిలోనిది కాదని తప్పించుకుంటున్నారన్నారు. పెనమలూరులో అనధికారిక రైతుబజారును ఏర్పాటు చేసి అధికరేట్లకు కూరగాయలు విక్రయించేస్తూ ప్రజలను దోచుకుంటున్నారని ఈ అంశంపైనా విచారణ చేయాలని కోరారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో మాజీ ఎమ్మెల్యేలు సింహాద్రి రమేష్‌బాబు, కైలే అనిల్ కుమార్ తదితరులు ఉన్నారు.

సర్వోత్తమం.. పుస్తక పఠనం

చిన్నారుల నుంచి పెద్దల వరకు గ్రంథ పఠనం పెంచి అన్నిరకాల పుస్తకాలను ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చేందుకు తమవంతు కృషిచేస్తోంది విజయవాడ బెంజిసర్కిల్ సర్వోత్తమ భవనంలోని 'సర్వోత్తమ గ్రంథాలయం'. ఎంతో పురాతనమైన గ్రంథాలయంలో ఎన్నో పుస్తకాలు, గ్రంథాలు దర్శనమిస్తాయి. సంవత్సరం మొత్తం (పబ్లిక్ హాలిడేస్ మినహా) గ్రంథాలయం పాఠకులకు అందుబాటులో ఉంటోంది.

(బెంజిసర్కిల్, ఆంధ్రజ్యోతి)

» పిల్లల్లో, పెద్దల్లో పఠనాసక్తిని పెంచడమే లక్ష్యం
» ఆరున్నర దశాబ్దాల చరిత్ర.. 62 వేల పుస్తకాలు
» తెలుగు తాళపత్రాలు ఇక్కడ భద్రం



గ్రంథాలయంలో ఉంచిన పుస్తకాలు





ఆరున్నర దశాబ్దాల చరిత్ర..

ఆంధ్రప్రదేశ్ గ్రంథాలయ సంఘం ఆధ్వర్యంలో పని చేసే 'సర్వోత్తమ' గ్రంథాలయానికి ఆరున్నర దశాబ్దాల చరిత్ర ఉంది. దీనిని 1960లో స్థాపించారు. అయితే 1986 వరకు లైబ్రరీ సైన్స్‌లో శిక్షణ పొందేవారికే పరిమితం కాగా.. పాఠకుల అవసరాన్ని దృష్టిలో ఉంచుకొని దీనిని 1986 నుంచి అందరికీ అందుబాటులోకి తీసుకువచ్చారు. రోజుకు సుమారు 140 నుంచి 160 మంది వరకు పాఠకులు ఇక్కడ పుస్తక పఠనం చేస్తూ ఉంటారు.

అందుబాటులో తెలుగు తాళపత్ర గ్రంథం

'సర్వోత్తమ' గ్రంథాలయంలో మహాభారతానికి సంబంధించి తెలుగులో లిఖించిన తాళపత్ర గ్రంథం ఇక్కడ ఉంది. ఇంగ్లీష్, తెలుగు సాహిత్యంతో పాటు పోటీ పరీక్షల రిఫరెన్స్ పుస్తకాలు, సోషల్ సైన్స్, కామర్స్, ఇంజనీరింగ్, మెడిసిన్, పర్సనాలిటీ డెవలప్‌మెంట్, రెలిజియన్



పుస్తకాలు, నేతల జీవిత చరిత్ర, బాలమిత్ర, చందమామ, సన్మాన సంచికలు తదితర సుమారు 62వేల పుస్తకాలు ఇక్కడ అందుబాటులో ఉన్నాయి. పుస్తకాలతో పాటు మ్యాగజైన్‌లు, న్యూస్ పేపర్లు కూడా చదవుకునే అవకాశం ఇక్కడ ఉంది. చిన్నారులకు సంబంధించిన పుస్తకాలను అబ్దుల్ కలాం చిల్డ్రన్స్ లైబ్రరీ పేరుతో ఏర్పాటుచేశారు. సెలవు దినాల్లో ఉదయం 9నుంచి సాయంత్రం 5గంటల వరకు, మిగిలిన రోజుల్లో ఉదయం 9నుంచి రాత్రి 8గంటల వరకు ఈ లైబ్రరీ పనిచేస్తుంది. పోటీ పరీక్షలు రాసేవారు ఇక్కడకు వచ్చి పుస్తకాలను చదువుతుంటారు. గ్రంథాలయంలో 3,182 మంది సభ్యులు ఉన్నారు. నామమాత్రపు రుసుంతో ఇళ్లకు పుస్తకాలు ఇస్తూ పుస్తక పఠనం ప్రోత్సహిస్తున్నారు.

సివిల్స్‌కు ప్రిపేర్ అవుతున్నా..



- కె.ధనాంక, యనమలకుదురు

సివిల్స్ ప్రిపరేషన్ కోసం గత నాలుగు నెలలుగా గ్రంథాలయానికి వస్తున్నా. పోటీ పరీక్షలకు ఉపయోగపడే అనేక గ్రంథాలు ఇక్కడ అందుబాటులో ఉన్నాయి. స్టడీస్‌కు ఈ పుస్తకాలు ఎంతగానో ఉపయోగపడుతున్నాయి.

పోటీ పరీక్షలకు సమాయత్తం



- జి.సాయి ప్రసాద్, పటమట

పోటీ పరీక్షలకు సంబంధించిన గ్రంథాలు ఇక్కడ లభ్యమవుతున్నాయి. రిఫరల్ బుక్స్ కోసం వస్తున్నా.. ఎంతో జ్ఞానాన్ని అందించే పుస్తకాలు ఉన్నాయి. అన్ని రకాల పుస్తకాలు ఉచితంగా ఒక చోట చదువుకునే అవకాశం ఈగ్రంథాలయంలో లభించింది. నిర్వాహకులకు అభినందనలు.

గ్రంథ పఠనం పెంచేందుకే..



- రావి శారద, గ్రంథాలయ సంఘం ప్రధాన కార్యదర్శి

పిల్లల నుంచి పెద్దల వరకు గ్రంథ పఠనం పెంచేందుకు కృషిచేస్తున్నాం. పాతకాలం నాటి పుస్తకాలతో పాటు అనేక కొత్త పుస్తకాలు కూడా గ్రంథాలయంలో అందుబాటులో ఉంచాం. పిల్లలకు ప్రత్యేకంగా పుస్తకాలు ఉన్నాయి. పుస్తక పఠనమే కాకుండా చందాదారులకు నామమాత్రపు సభ్యత్వ రుసుంతో ఇళ్లకు పుస్తకాలు ఇచ్చి వారిలో పఠనాసక్తిని పెంచుతున్నాం.

తిరువూరు మున్సిపాలిటీలో
చైర్‌పర్సన్ వివాదం కొలిక్కి వచ్చేనా..!

తిరువూరు, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి) : మున్సిపాలిటీలో చైర్‌పర్సన్ రాజీనామా అంశం బుధవారం కౌన్సిల్ సమావేశంలోనైనా కొలిక్కి వచ్చేనా.. అంటూ స్థానికంగా చర్చ జరుగుతోంది. వైసీపీ కౌన్సిలర్ల మధ్య చైర్‌పర్సన్ వివాదం రోజుకో మలుపు తిరుగుతోంది. గత్తం కస్తూరిబాయి చైర్‌పర్సన్‌గా ప్రమాణ స్వీకారం చేసిన నాటినుంచి వైసీపీ కౌన్సిలర్లలో వర్గపోరు మొదలైంది. బోర్డు ఏర్పడి నాలుగేళ్ల పూర్తవడంతో అసమ్మతి వాదులు అవిశ్వాసాన్ని తెరపైకి తెచ్చారు. ఏప్రిల్ 3న కౌన్సిల్ సమావేశం అనంతరం చైర్‌పర్సన్ తన రాజీనామాను కమిషనర్‌కు అందజేశారు. ఈనెల 17న ఆమోదానికి నిర్వహించిన కౌన్సిల్ సమావేశంలో చైర్‌పర్సన్ అస్వస్థతకు గురవడంతో వాయిదా చేశారు. తదుపరి సమావేశం 23న నిర్వహించనున్నారు. ఒకే నెలలో మూడుసార్లు సమావేశం నిర్వహించడం పట్ల విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ సమావేశంలోనైనా చైర్‌పర్సన్ రాజీనామా అంశం కొలిక్కివస్తుందా అనే మీమాంస ప్రజల్లో నెలకొంది.



పినాకిని ఎక్స్‌ప్రెస్‌కు
ఎల్‌హెచ్‌బీ బోగీలు

రైల్వేస్టేషన్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి) : విజయవాడ టు చెన్నై ఇంటర్‌సిటీ డైలీ పినాకిని ఎక్స్‌ప్రెస్‌కు ఇంటిగ్రల్ కోచ్ ఫ్యాక్టరీ (ఐసిఎఫ్) బోగీల స్థానంలో లింక్ హాఫ్‌మెన్ బుష్ (ఎల్‌హెచ్‌బి) బోగీలను అనుసంధానం చేశారు. వీటివల్ల ప్రయాణికులకు మరింత సౌకర్యంగా ఉంటుందని విజయవాడ డివిజన్ అధికారులు తెలిపారు. ఎల్‌హెచ్‌బి ఆధునీకరించిన డిజైన్‌తో తయారు చేయబడి, ఏదైనా ప్రమాదాలు జరిగినప్పుడు బోగీమీద బోగీ పడకుండా ఉంటాయి. కుదుపులు తక్కువగా ఉండి మెరుగైన శీతలీకరణ, లైటింగ్ సిస్టమ్‌లు ఉంటాయి. ఎల్‌హెచ్‌బి కోచ్‌లు గంటకు 160 కిలోమీటర్ల వేగానికి అనుకూలంగా రూపొందాయి. ప్రస్తుతం దేశంలో 130 కిలోమీటర్ల వేగం వరకే రైళ్లు నడుస్తున్నాయి. ఏసీ చైర్‌కార్, త్రీఏసీ, టూఏసీ, వన్ ఏసీ, స్లీపర్ బోగీలు ఉంటాయి. రాజధాని, శతాబ్ది, దురంతో ఎక్స్‌ప్రెస్‌లకు కూడా ఎల్‌హెచ్‌బి బోగీలను అనుసంధానం చేస్తున్నారు. ఇవి పట్టాలు తప్పే ప్రమాదం చాలా తక్కువగా ఉంటుంది. బోగీలు ఐసీఎఫ్ బోగీల కంటే తేలికగా ఉంటాయి. ఈ సందర్భంగా విజయవాడ డీఆర్ఎం నరేంద్ర ఎ పాటిల్ మాట్లాడుతూ, ప్రయాణికులు ఆనందకరంగా గమ్యాలను చేరుకోవచ్చన్నారు.

నేడు బీచ్ కబడ్డీ జట్ల ఎంపిక

విజయవాడ(స్పోర్ట్స్), ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి) : కృష్ణాజిల్లా కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం ఉమ్మడి కృష్ణాజిల్లా స్త్రీ, పురుషుల బీచ్ కబడ్డీ జట్ల ఎంపికలు నిర్వహిస్తున్నట్టు కృష్ణాజిల్లా కబడ్డీ అసోసియేషన్ ఆర్గనైజింగ్ సెక్రటరీ పి.రవి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎంపికలు మల్లవోలు హైస్కూల్‌లో ఉదయం 9గంటలకు జరుగుతాయని, క్రీడాకారుల బరువు స్త్రీలు 75కేజీలు, పురుషులు 85కేజీలు లోపు ఉండాలని తెలిపారు. అదేవిధంగా ఎంపికలకు ఉదయం 9గంటలకు హాజరుకావాలనని, ఒరిజనల్ ఆధార్ కార్డుతో రావాలన్నారు. ఎంపికైన క్రీడాకారులు మేనెల 2న కాకినాడలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలలో జిల్లాకు ప్రాతినిధ్యం వహిస్తారని, ఇతర వివరాలకు ఫోన్ నెంబర్ 9704063555లో సంప్రదించాలని తెలిపారు.

హెచ్‌పీవీ వ్యాక్సిన్‌పై అవగాహన పెంచాలి

» ఎంబీ ఫౌండేషన్ ఉచిత క్యాంప్



మాట్లాడుతున్న డాక్టర్ పీవీ రామారావు, పి.పద్మ

గవర్నర్‌పేట, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి) : సెర్వికల్ కేన్సర్ నివారణకు హ్యూమన్ పాపిల్లోనూ వైరస్ (హెచ్‌పీవీ) వ్యాక్సిన్ తీసుకోవడం మహిళలకు చాలా అవసరమని, దీని ప్రాముఖ్యత గురించి ప్రజల్లో అవగాహన పెంచాలని ఆంధ్ర హాస్పిటల్స్ హెడ్ ఆఫ్ చిల్డ్రన్స్ సర్వీసెస్ అండ్ డైరెక్టర్ డాక్టర్ పీవీ రామారావు అన్నారు. మంగళవారం నక్కలరోడ్డులోని ఆంధ్రా హాస్పిటల్స్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, వ్యాక్సిన్‌పై సమాజంలో అవగాహన పెంచాల్సిన అవసరం ఉందన్నారు. దీనివల్ల దాతలు, స్వచ్ఛంద సంస్థలు ముందుకు వచ్చి పేద మహిళలకు వ్యాక్సిన్ ఉచితంగా అందించేందుకు అవకాశం లభిస్తుందన్నారు. సినీహీరో మహేష్‌బాబు ఫౌండేషన్ (ఎంబీఎఫ్) సహకారంతో 9 సంవత్సరాల నుంచి 45 సంవత్సరాల లోపు బాలికలు, మహిళల కోసం విజయవాడ ఆంధ్ర హాస్పిటల్స్‌లో హెచ్‌పీవీ వ్యాక్సిన్ ఉచిత క్యాంపు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. క్యాంపులో 9 నుంచి 14 సంవత్సరాల లోపు బాలికలకు 2 డోసులు, 14 నుంచి 45 సంవత్సరాల లోపు వయస్సు వారికి 3 డోసుల చొప్పున అందిస్తామన్నారు. ఒక్కొక్క డోసుకు రూ. 2 వేల వరకు ఖర్చు అవుతుందని, ఎంబీ ఫౌండేషన్ ఈ క్యాంపు కోసం రూ. 40 లక్షల వరకు ఖర్చు చేయనున్నట్టు డాక్టర్ పీవీ రామారావు తెలిపారు. చీఫ్ ఆఫ్ ఫీటల్ మెడిసిన్ అండ్ డైరెక్టర్ డాక్టర్ పాతూరి పద్మ మాట్లాడుతూ, హెచ్‌పీవీ వ్యాక్సిన్ మహిళలకు అందించడంలో సహకరిస్తున్న ఆంధ్ర హాస్పిటల్స్, ఎంబీ ఫౌండేషన్ నిర్వాహకులు మహేష్‌బాబు, నమ్రతలకు ధన్యవాదాలు తెలిపారు. సెర్వికల్ కేన్సర్ వల్ల ప్రతి 8 నిముషాలకు ఒక మహిళ ప్రాణాలు కోల్పోతున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. వ్యాక్సినేషన్ ఎంతో ఖరీదుతో కూడినదని, ప్రభుత్వ నేషనల్ వ్యాక్సిన్ ప్రోగ్రామ్‌లో హెచ్‌పీవీ లేని కారణంగా దాతలు, స్వచ్ఛంద సంస్థలు ముందుకు వచ్చి, స్కూల్స్, హాస్పటల్స్‌లో బాలికలు, మహిళల కోసం క్యాంపులు నిర్వహించాలని కోరారు.

ఆర్ఐ వేధిస్తున్నాడని
వీఆర్‌ఏ ఆత్మహత్యాయత్నం!



వీఆర్‌ఏ మస్తాన్

ఎ.కొండూరు, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి) : రెవెన్యూ కార్యాలయాన్ని తన గుప్పెట్లో పెట్టుకుని ఆర్ఐ కిందిస్థాయి సిబ్బందిని దూషించడం, తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నాడని ఆరోపిస్తూ వీఆర్‌ఏ ఆత్మహత్యకు ప్రయత్నించిన ఘటన స్థానికంగా కలకలం రేపింది. ఎ.కొండూరు తహసీల్దార్ బి.ఆశయ్య పదోన్నతిపై బదిలీకాగా, డిప్యూటీ తహసీల్దార్ రాజ్ కుమార్‌కు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. అదే కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా ఉన్న దివ్యప్రసాద్ అదనంగా ఆర్ఐ బాధ్యతలు నిర్వహిస్తు కార్యాలయ సిబ్బందిని తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నాడని ఆరోపణలున్నాయి. ఈ క్రమంలో గొల్లమందల వీఆర్‌ఏ షేక్ మస్తాన్ ఏడాది నుంచి నైట్ డ్యూటీలు చేస్తున్నారు. వేసవికాలం కావడంతో అనారోగ్యానికి గురికాగా ఇన్‌చార్జ్ తహసీల్దార్ అనుమతితో రెండు రోజుల నుంచి మస్తాన్ కుమారుడు బాబ్జీని నైట్ డ్యూటీకి పంపుతున్నాడు. అయితే తహసీల్దార్ కార్యాలయంలో ఏసీ పాడుచేశాడని మస్తాన్‌ను ఆర్ఐ కార్యాలయానికి పిలిపించి తీవ్ర పదజాలంతో దూషించాడని, తండ్రీకొడుకులపై కేసు పెడతామని, ఉద్యోగం లేకుండా చేస్తామని హెచ్చరించడంతో మనస్తాపం చెందిన మస్తాన్ మంగళవారం ఇంట్లో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్యకు ప్రయత్నించారు. భార్య కేకలు వేయడంతో స్థానికులు మస్తాన్‌ను రక్షించారు. ఆర్ఐ తనను వేధింపులకు గురిచేస్తు, కేసులు పెట్టి ఉద్యోగం లేకుండా చేస్తామని బెదిస్తున్నాడని, రక్షణ కల్పించాలని, ఇదే విషయంపై జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేయనున్నట్టు మస్తాన్, కుటుంబసభ్యులు తెలిపారు. దీనిపై ఇన్‌చార్జి తహసీల్దార్ రాజ్‌కుమార్‌ను వివరణ కోరగా.. మస్తాన్ ఆత్మహత్యయత్నం ఘటన తన దృష్టికి వచ్చిందని, మస్తాన్ కుమారుడు బాబ్జి నైట్ డ్యూటీలో ఉండగా తహసీల్దార్ కార్యాలయంలోని ఏసీ, సీసీ కెమెరాలు చెడిపోవడంతో ఆర్ఐ మందలించినట్టు తెలిసిందన్నారు.

ఉపాధి పనుల్లో అవినీతి మేత!

» మోగులూరులో ఫీల్డ్ అసిస్టెంట్ మాయాజాలం

కంచికచర్ల రూరల్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి) : ఎక్కడో నివాసం ఉంటున్న వారిని పనికి వచ్చినట్టు చూపి హాజరు వేసి నిధులు స్వాహా చేస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్ ఉదంతం వెలుగుచూసింది. కంచికచర్ల మండలం మోగులూరు గ్రామంలో ఉపాధి కల్పించాలనే ప్రభుత్వ లక్ష్యానికి ఫీల్డ్ అసిస్టెంట్స్ తూట్లు పొడుస్తున్నారు. గ్రామానికి చెందిన ఎఫ్ఏ బంకా ఆంజనేయులు ఎక్కడో నివాసం ఉంటున్న వారికి హాజరు వేసి వారి నుంచి కొంత సొమ్మును వసూలు చేయడంతో పాటు వచ్చిన వారిని పనులు లేవని తిప్పి పంపుతున్నట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి. గ్రామానికి చెందిన టీడీపీ నేత వెలగా నరసింహారావు ఈ ఉదంతంపై ఫిర్యాదు చేశారు. అసిస్టెంట్ పీడీ వెంకటేశ్వరరావు, ఏపీవో రమాదేవిలు ఈవిషయంపై గ్రామంలో విచారణ చేసి ఎఫ్ఏ అవినీతికి పాల్పడినట్టు నిర్ధారించారు. దీనిపై ఎంపీడీవో లక్ష్మీకుమారిని వివరణ కోరగా ఫిర్యాదు మేరకు అధికారులను విచారణకు పంపినట్టు చెప్పారు. గ్రామానికి చెందిన బంకా పుల్లయ్య విశాఖలో నివాసం ఉండగా అతడి పేరున జాబ్ కార్డు 10903 నంబరుపై 20 రోజులు హాజరు వేశారు. దంతమాల మురళీకృష్ణ ఇబ్రహీంపట్నంలో నివాసం ఉండగా అతడి జాబ్‌కార్డు 11089కు 15రోజులు, స్వయంగా ఎఫ్ఏకి సోదరి అయిన మెరుగుల దేవమ్మ జాబ్‌కార్డు నంబరు 11039కు 15 రోజులు హాజరు వేసినట్టు గుర్తించారు.

ధర లేక దిగాలు!

(5వ పేజీ తరువాయి)

మించి దిగుబడి రాలేదు. ఈ ఏడాది మినుము సాగు చివరి దశ వరకు ఎకరానికి కనీసంగా రూ.30 వేలకుపైగా పెట్టుబడిగా రైతులు పెట్టారు. దిగుబడి మాత్రం ఎకరానికి నాలుగైదు క్వింటాళ్లు మాత్రమే వస్తుండటంతో రైతులకు ఖర్చులు కూడా రాని పరిస్థితి నెలకొంది. ప్రస్తుతం మినుము మద్దతు ధర క్వింటాకు ఏడు వేలకు పడిపోయిందని, ఈ ధరలు ఇలానే కొనసాగితే సాగుకు పెట్టిన పెట్టుబడి కూడా రాదని రైతులు వాపోతున్నారు. గతేడాది ఇదే రోజుల్లో మినుము బహిరంగ మార్కెట్‌లో క్వింటా రూ.7,700లకుపైగా విక్రయించామని, ఈ ఏడాది వ్యాపారులంతా కూడబలుక్కుని ధరలు తగ్గించివేశారని, ప్రభుత్వం ఈ అంశంపై దృష్టి సారించి తమను ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

వాయు 'వేగం'గా..

(5వ పేజీ తరువాయి)

సర్వే నిర్వహించాల్సి ఉంటుంది. అమరావతి విమానాశ్రయ సమగ్రాభివృద్ధికి మాస్టర్ ప్లాన్‌ను తయారు చేసి ఫైనాన్షియల్ మోడల్‌పై నివేదిక ఇవ్వాల్సి ఉంటుంది. పర్యావరణ, సోషల్ ఇంపాక్ట్ సర్వే నిర్వహించాలి. ప్రాజెక్టుకు ప్రభుత్వ సంస్థల నుంచి వివిధ దశల్లో ఆమోదాలను సులభతరం చేయటం కోసం తగిన సూచనలు చేయాలి. వీటితో పాటు కన్సల్టెన్సీ సంస్థ డిమాండ్ - మార్కెట్ అసెస్‌మెంట్ స్టడీ, కేస్ స్టడీ, బెస్ట్ ప్రాక్టీసెస్ వంటి రిపోర్టులను అందించాలి. ఇవి కాకుండా ప్రధానంగా పాసెంజర్ టెర్మినల్, కార్గో టెర్మినల్స్ డిజైన్స్ రూపకల్పన చేయటంతో పాటు, కార్లు, బస్సులు, కార్గో వెహికల్స్‌కు పార్కింగ్ ప్లేస్‌లు నిర్ణయించటం, పర్యాటకులకు విమానాశ్రయంలోనే వసతి సదుపాయాలు, భద్రతాపరంగా తీసుకోవాల్సిన చర్యలు వంటివి కూడా సమగ్ర నివేదిక అందించాల్సి ఉంటుంది.

ఆగని ఇసుక దుమారం!

(5వ పేజీ తరువాయి)

అవి ప్రతిబింబించవు.

ఆ సంస్థలే నేరుగా పాల్గొన్నాయా?

వందల కోట్ల రూపాయల టర్నోవర్ కలిగిన స్థానికేతర సంస్థలు నిజంగానే టెండర్లలో పాలు పంచుకున్నాయా..? వీటి పేర్లను ఉపయోగించుకుని ఎవరు లబ్ధి పొందాలనుకుంటున్నారు?.. అనే అనుమానాలు కలుగుతున్నాయి. టెండరులో అందరూ ఒకే రేటు వేస్తే ఆ టెండరును ఎవరికి ఇవ్వాలన్న దానిపై ఓ నిబంధన ఉంది. ఆ సంస్థల వార్షిక టర్నోవర్‌ను గమనించి, ఏది ఎక్కువగా ఉంటే దానికి టెండరును అప్పగిస్తారు. వార్షిక టర్నోవర్ సరిగ్గా లేని కొన్ని సంస్థలు ఈ టెండర్లలో పాల్గొనేందుకు సదరు బడా సంస్థల అంగీకారంతో ఆ పేర్లను వాడాయన్న ఆరోపణలు కూడా ఉన్నాయి.

ప్రైవేటు ట్రావెల్స్ దందా!

(5వ పేజీ తరువాయి)

దుర్వాసన వస్తున్నాయని ప్రయాణికులు అంటున్నారు. అధిక ధరలు వసూలు చేస్తున్న ట్రావెల్స్ ప్రయాణికుల కనీస సదుపాయాలు కల్పించకపోయినా అధికారులు పట్టనట్టు చూస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

మొరాయిస్తున్న బస్సులు

ఓ సంస్థకు చెందిన ప్రైవేటు బస్సు సోమవారం రాత్రి 10 గంటలకు విజయనగరానికి బయలుదేరింది. సుమారు 12 గంటల సమయంలో హనుమాన్ జంక్షన్ టోల్‌గేట్ దాటాక బ్రేక్ ఫెయిలైంది. ఆ సమయంలో రోడ్లపై వెళ్తున్న వాహనాలను ఆపి ప్రయాణికులను సర్దుబాటు చేసి పంపారు. బస్సు మొరాయిస్తే తామేం చేయగలమని, మరో బస్సు కావాలంటే ఉదయం 5 గంటల వరకు వేచిఉండాలని, లేకపోతే ఈ దారిలో వచ్చిన వాహనాల్లో సర్దుకుని ప్రయాణించాలని సమాధానం చెప్పారు.

ఒక్కోసారి గంటల తరబడి రోడ్లపైనే..

ప్రైవేటు బస్సులు మార్గమధ్యలో మొరాయిస్తున్నాయని, అలాంటి సందర్భాల్లో రోడ్లపైనే గంటల తరబడి వేచి ఉంచుతున్నారని పలువురు చెబుతున్నారు. లగేజీ, పిల్లలతో ప్రయాణిస్తున్న తమను మధ్యలో రోడ్లపైనే ఉంచడంతో అర్ధరాత్రి వేళ ఏం చేయాలో తెలియని స్థితిలో అయోమయానికి గురవుతున్నామని వాపోతున్నారు. ఆ మార్గంలో వచ్చే బస్సుల్లో ఎక్కించేందుకు ప్రయత్నిస్తున్నారే తప్ప సంస్థకు చెందిన మరో బస్సును ఏర్పాటు చేయడం లేదని చెబుతున్నారు. ఒకవేళ డ్రైవర్లను ప్రశ్నిస్తే బస్సు ఆగిపోతే మేమేం చేస్తామని, కావాలంటే వేరే బస్సు వచ్చేంతవరకు ఉండండి.. లేకపోతే మీకు నచ్చింది చేసుకోండని దురుసుగా సమాధానం చెబుతున్నారంటున్నారు.

ప్రత్యామ్నాయ సర్వీసుల్లేవ్!

మార్గమధ్యలో బస్సుల్లో సాంకేతిక లోపాలు వచ్చినప్పుడు సదరు సంస్థ ప్రత్యామ్నాయంగా మరో బస్సును ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. అయితే వారి వద్ద ఉన్న బస్సులన్నీ సర్వీస్ చేస్తుండటంతో ప్రయాణిస్తున్నబస్సుల్లో ఏదైనా ఆటంకం వస్తే ప్రయాణికులను ఆ మార్గంలో వచ్చే మరో బస్సులో పంపించాల్సిన పరిస్థితి నెలకొంది. అత్యవసరంగా వెళ్లాల్సిన వారి పరిస్థితి అయితే మరీ ఘోరంగా ఉంటుంది. వారికి ఏ బస్సు దొరికితే ఆ బస్సులో ఖాళీ లేకపోయినా సీట్ల మధ్య ఖాళీ స్థలంలోనో, డ్రైవర్ పక్కనో గేర్‌బాక్స్ దగ్గర సర్దుకుని ప్రయాణించాల్సిన దుస్థితి. అయితే ట్రావెల్స్ యజమానులు బస్సులు బయలుదేరే ముందు తనిఖీ చేయకుండా కాలం చెల్లిన బస్సులను వినియోగిస్తుండడం వల్ల ఇలాంటి సంఘటనలు జరుగుతున్నాయని అంటున్నారు.

భయపెడుతున్న అగ్నిప్రమాదాలు

ఇటీవల విజయవాడ నగరంలో ఆర్టీసీ బస్టాండ్ ఎదుట ఓ ప్రైవేటు బస్సు అగ్నిప్రమాదానికి గురైంది. ఆ సమయంలో బస్సులో ప్రయాణికులు లేకపోవడంతో ప్రాణనష్టం తప్పింది. ఫిట్‌నెస్ లేని బస్సుల వల్లే ఇలాంటివి జరుగుతున్నాయని విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ప్రైవేటు ట్రావెల్స్ యజమానులు డొక్కు బస్సులు నడుపుతున్నారని ఆరోపణలు కూడా ఉన్నాయి.

కమీషన్ల కోసం అడ్డమైన హోటల్స్ వద్ద నిలుపుదల

ఉదయం, రాత్రివేళల్లో భోజనం కోసం ట్రావెల్స్ డ్రైవర్లు హోటల్స్ వద్ద ఆపుతారు. అయితే హోటల్ యాజమానుల దగ్గర కమీషన్ కోసం ఆహారం బాగా లేకపోయినా నిలుపుదల చేస్తున్నారని ప్రయాణికులు ఆరోపిస్తున్నారు. భారీగా చార్జీలు వసూలు చేస్తున్న ట్రావెల్స్ యజమానులు బస్సుల్లో కనీస సౌకర్యాలు కల్పించడంలేదని విమర్శిస్తున్నారు. చిన్న పిల్లలు, వృద్ధులతో ప్రయాణిస్తున్న సమయంలో కాలకృత్యాలు తీర్చుకోవాలన్నా వాహనాన్ని ఆపరని చెబుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ప్రైవేటు బస్సులను ఎప్పటికప్పుడు తనిఖీలు చేసి, నిబంధనలు పాటించని యజమానులపై చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు.

కన్నుల పండువగా శ్రీవారి కల్యాణోత్సవం

హనుమాన్‌జంక్షన్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి) : స్థానిక వేంకటేశ్వరస్వామి దేవ స్థానంలో నిర్వహిస్తున్న శ్రీవారి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా మూడవ రోజు మం గళవారం ఆలయ అర్చకులు చక్రావధానుల సీతారామాచార్యులు పర్యవేక్షణలో శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి వార్ల కల్యాణ మహోత్సవాన్ని కనుల పం డువగా జరిపారు. ఆలయంలో విశేష పూజలతో పాటు పుత్ర కామేష్టి, శ్రీసూత్ర హో మం, లక్ష కుంకుమార్చన కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. ట్రస్టీలు కాకాని అరుణ బాబు, తవ్వా పూర్ణచంద్రరావు తదితరులు కార్యక్రమాలను పర్యవేక్షించారు.



రోడ్డెక్కిన మురుగు!

- వెదజల్లుతున్న దుర్వాసన
- పూడుకుపోయిన డ్రెయినేజీ
- రూ. లక్షలతో నిర్మించిన ఉపయోగపడని డ్రెయిన్
- పట్టించుకోని అధికారులు, పాలకులు
- ఇబ్బంది పడుతున్న ప్రజలు





రోడ్డుపై నిలిచిపోయిన మురుగు.. డ్రెయిన్‌లో ప్రవహించని మురుగు

(గన్నవరం- ఆంధ్రజ్యోతి)

పొంగుతున్న డ్రెయినేజీ.. కదలని మురుగు.. వ్యర్థాలతో దుర్వాసన పీలుస్తూ ఎస్సీ కాలనీ వాసులు తీవ్రఇబ్బందులు పడుతున్నారు. మురుగుతో పిల్లలు, వృద్ధులు అనారోగ్యానికి గురవుతున్నారు. ఈ సమస్య నిన్న, మొన్నటిది కాదు. సుమారు పదేళ్ల నుంచి ఉంది. గత టీడీపీ హయాంలో మండలంలోని పురుషోత్తపట్నం ప్రధాన రోడ్డుకు ఇరువైపుల డ్రెయినేజీని నిర్మించారు. అప్పటి నుంచి డ్రెయినేజీ నీరు ఎక్కడికక్కడే నిలిచిపోయింది. అక్కడక్కడ కొన్ని ఆక్రమణలు ఉన్నాయి. ఆక్రమణదారులు తమ ఇంటి ముందు నుంచి మురుగు ప్రవహించకుండా అడ్డుపడుతున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. అధికారులు ఏమీ చేయలేకపోతున్నారు. సమస్యను పరిష్కరించమని అధికారులకు మొరపెట్టుకున్న పట్టించుకునే నాధుడే కరువయ్యారని వాపోతున్నారు. గ్రామస్తులతో పాటు కొండపావులూరుపై గ్రామాలకు వెళ్లేవారు ఇబ్బందులు పడుతున్నారు. పెద్ద వాహనాలు రాకపోకలు సాగించేటప్పుడు మురుగు చిమ్మి ఇళ్లల్లోకి, స్థానికులు మీద పడుతున్నాయి. ఎక్కడికక్కడ మురుగు నిలిచి ఉండటంతో పచ్చగా మారి దోమలు వృద్ధి చెందుతున్నాయి. స్థానికులు రోగాల బారిన పడుతున్నారు. పిల్లలను బయటకు పంపాలంటే మురుగులో పడిపోతారని తల్లిదండ్రులు భయాందోళన చెందు తున్నారు. దశాబ్ధ కాలంగా ఉన్న మురుగు సమస్యను పరిష్కరించటంలో అధికారులు విఫలమవుతున్నారు. అధికారులు సమన్వయంతో డ్రెయినేజీ సమస్యను పరిష్కరించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

దుర్వాసన భరించలేకపోతున్నాం



ఎక్కడి మురుగు అక్కడే నిలిచిపోయింది. దుర్వాసన భరించలేకపోతున్నాం. జ్వరం బారిన పడి పది రోజులు ఆస్పత్రిలో ఉండి రెండు నెలలు తరువాత ఇప్పుడే కోలు కుంటున్నాను. మురుగు ప్రవహించేలా చర్యలు తీసుకోవాలి.

- శావల మార్తమ్మ

డ్రెయిన్‌లో పూడిక తీయాలి



మురుగుతో అనారోగ్యం పాలవుతున్నాం. చిన్నారులు, వృద్ధులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. డ్రెయినేజీ పూడుకుపోయింది. ఇంట్లో ఉండలేకపోతున్నాం. కొంత మంది గురించి మిగిలిన వారందరిని ఇబ్బందులకు గురిచేయటం సరికాదు.

- కూరగంటి సుబ్బారావు

సమస్య పరిష్కరించాలి



డ్రెయినేజీ నిర్మించారని సంతోష పడాలో, ఎక్కడి మురుగు అక్కడ నిల్వ ఉంటుందని బాధ పడాలో అర్థం కావటం లేదు. ఏళ్ల తరబడి సమస్య ఉంటుంది. పరిష్కారానికి చర్యలు తీసుకోవటం లేదు. దోమలు వృద్ధి చెంది దాడి చేస్తున్నాయి.

- కాట్రు ప్రసాద్



తేలప్రోలు జడ్పీ పాఠశాల హెచ్‌ఎంకు ఇన్వర్టర్, మైక్ అందజేస్తున్న పూర్వవిద్యార్థులు

పాఠశాలకు ఇన్వర్టర్, మైక్ అందజేత

ఉంగుటూరు, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి) : చదువుకున్న పాఠశాల అభివృద్ధికి తమ వంతు సహకారం అందించేందుకు పూర్వవిద్యార్థులు ముందుకురావడం అభినందనీయమని తేలప్రోలు జడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం వీవీ ఆదిలక్ష్మి అన్నారు. 2001- 2002 విద్యా సంవత్సరం 10వ తరగతి బ్యాచ్ విద్యార్థులు ఇటీవల స్థానిక పాఠశాలలో ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమం ఉత్సాహం గా జరుపుకున్నారు. ఈ సందర్భంగా తాము చదువుకున్న పాఠశాల రుణం తీర్చుకోవాలని సంకల్పించి విరాళాలను సేకరించారు. సుమారు రూ.40వేలతో ఇన్వర్టర్, మొబైల్ మైక్‌ను కొనుగోలుచేసి మంగళవారం పాఠశాల హెచ్‌ఎంకు అందజేశారు.

కేసరపల్లిలో చోరీ

గన్నవరం, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కేసర పల్లి సుందరయ్య కాలనీలో మంగళవారం తెల్లవారు జామున ఓ ఇంట్లో దొంగలు చొరబడి చోరీకి పాల్పడ్డారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆ గ్రామానికి చెందిన మాదల రామకృష్ణ ఇంట్లో నిద్రిస్తున్న సమయంలో దొంగలు పడి ఇంట్లో ఉన్న రూ. 20 వేలు నగదు, రూ.30 వేల విలువ చేసే సెల్‌ఫోన్ ఎత్తుకుపోయినట్లు తెలిపారు. బాధితుడు ఫిర్యాదు మేరకు పోలీసుల కేసు నమోదు చేశారు.

స్వయం సహాయక సంఘ సభ్యులకు అవగాహన

పెనమలూరు, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మహిళా స్వయం సహాయక సంఘ సభ్యులకు మంగళవారం జీవనోపాదుల సమావేశం నిర్వహించారు. సమావేశానికి ముఖ్య అతిథిగా ప్రాజెక్టు డైరెక్టర్ హరినాథ్ హాజరయ్యారు. జీవనోపాదులు మెరుగుపరచుకోవడం గురించి, కుటుంబ ఆదాయాలు పెంచుకొనే మార్గాలు, ప్రధాన మంత్రి సూర్యఘర్ గురించి ఆయన సభ్యులతో మాట్లాడారు. కార్యక్రమంలో ఏరియా కో-ఆర్డినేటరు పీక్లానాయక్, ఏపీఎం కృష్ణం రాజు, సీసీలు హాజరయ్యారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో శేషగిరిరావు

ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

ఉయ్యూరు, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి) : ప్రధాన మంత్రి సురక్ష బీమా యోజన, జీవనజ్యోతి బీమా యోజన పథకాలపై ప్రజల్లో విస్తృత ప్రచారం ద్వారా అవగాహన కల్పించి పథకాలు సద్వినియోగం చేసుకునేలా చూడాలని ఎంపీడీవో జీఎస్‌వీ శేషగిరి రావు అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్‌లు, వెలుగు సిబ్బందితో సమావేశం నిర్వహించి సురక్ష, జీవనజ్యోతి బీమా యోజన పథకాలను సవివరంగా తెలియజేశారు. ప్రజలు ఈ అవకాశం సద్వినియోగం చేసుకోవాలన్నారు.

మానవత కార్యవర్గం

హనుమాన్‌జంక్షన్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి) : మానవత జంక్షన్ శాఖ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మంగళవారం స్థానిక ఏలూరు రోడ్డులోని మానవత కార్యాలయంలో ఆ సంస్థ రాష్ట్ర అధ్యక్షుడు మారుబోయిన కోటేశ్వరరావు ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో అధ్యక్షుడిగా బానాల నరసింహారావు, కార్యదర్శిగా పాబోలు గణేష్, కోశాధికారిగా ఘంటా ఇందిరాదేవి, ఉపాధ్యక్షుడిగా రేవిణిశెట్టి సూర్యనారాయణ, సహాయ కార్యదర్శిగా మరీదు వెంకటస్వామి మరి కొందరిని సభ్యులుగా ఎన్నుకున్నారు.

ప్రపంచం గర్వించదగిన నేత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్

గన్నవరం, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి) : ప్రపంచం గర్వించదగిన నేత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అని ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు గుడిసే దేవానంద్ అన్నారు. మంగళవారం స్థానిక అంబేడ్కర్ పార్క్‌లో బీజేపీ పిలుపు మేరకు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతి వారోత్సవాల్లో భాగంగా జిల్లా స్థాయి సెమినార్ నిర్వహించారు. ఈ సందర్భంగా దేవానంద్ మాట్లాడుతూ, అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం ఎంత కృషి చేసారన్నారు. బీజేపీ పేద వర్గాల కోసం పని చేస్తోందన్నారు. రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం ఎంతో సమ ర్థవంతంగా పని చేస్తోందన్నారు. మాజీ ఎమ్మె ల్యే అయ్యాజీ వేమా, బీజేపీ జిల్లా అధ్యక్షులు రాజాబాబు, ఉన్నమట్ల కపర్థి, కుమార్, గాంధీ, సతీష్, మనోజ్‌కుమార్, విజయేంద్ర, సర్పంచ్ నిడమర్తి సౌజన్య పాల్గొన్నారు.




గాలి అబ్రహం దంపతులను సన్మానిస్తున్న అన్నే శివనాగేశ్వరరావు తదితరులు

ఉపాధ్యాయుల సేవలు వెలకట్టలేనివి

- విద్యాదాత అన్నే శివనాగేశ్వరరావు

పెనమలూరు, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి) : ఎన్నో వేల మంది విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్ది వారిని ఉన్నత స్థానాల్లో నిలబెట్టే ఉపాధ్యాయుల సేవలు వెలకట్టలేనివని ప్రముఖ విద్యాదాత, కానూరు ఉన్నత పాఠశాల కన్వీనర్ అన్నే శివనాగేశ్వర రావు పేర్కొన్నారు. కానూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఫిజికల్ సైన్సు స్కూల్ అసిస్టెంటుగా పని చేస్తూ పదవీ విరమణ పొందిన గాలి అబ్రహం దంపతులను మంగళవారం ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, విద్యార్థులను తీర్చిదిద్దడంలో తల్లిదండ్రుల తర్వాత గురువులదే సమాజంలో అత్యంత కీలక బాధ్యతగా అభివర్ణించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు విజయలక్ష్మి, ఉపాధ్యాయ సంఘ నాయకులు కే రెడ్డమ్మ, పూర్వ విద్యార్థుల కమిటీ అధ్యక్షులు బొకినాల అజరయ్య తదితులు పాల్గొన్నారు.

పీవై జిమ్ అభ్యాసకులకు పతకాలు



హనుమాన్‌జంక్షన్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి) : నేటి సమాజంలో ప్రతి వ్యక్తి ప్రతి రోజు కొంత సమయం వ్యాయామం చేయవాలని విజయ డెయిరీ ఛైర్మన్ చలసాని ఆంజనేయులు అన్నారు. ఇటీవల గుడివాడలో ఏపీ పవర్ లిఫ్టింగ్ అసోసి యేషన్ నిర్వహించిన పోటీల్లో జంక్షన్ పీవై జిమ్ అభ్యాసకులు బి. ప్రసన్నకుమార్, పి.మురళి బంగారు పతకాలు, ప్రమోద్‌గిరి, దొరబాబు, సాహితి, సాయిశ్రీలు వెండి, రజిత పతకాలు పతకాలు సాధించారు. సోమవారం రాత్రి జిమ్ ఆవరణలో అభినందన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా చలసాని పాల్గొని విజేత లను సత్కరించి అభినందించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ కోటే అశోక్‌కుమార్, రమేశ్ చక్రవర్తి, బిల్డర్ కేతినీడి తేజోమూర్తి, వీరమాచనేని వాణి, పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ కృష్ణాజిల్లా అధ్యక్షుడు మారెల్ల వెంకటేశ్వరరావు, జిమ్ ట్రైనర్లు ప్రసన్నకుమార్, దొరబాబు తదితరులు పాల్గొన్నారు.

బాపులపాడు హైస్కూల్‌కు రూ.10లక్షల విరాళం

హనుమాన్‌జంక్షన్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి) : ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించే విధంగా విద్యా బోధన ఉండాలని దీపక్ నెక్స్‌జెన్ ఎండీ అడుసుమిల్లి వెంకటసుబ్రహ్మణ్యం అన్నారు. సోమవారం రాత్రి బాపులపాడు జడ్పీ హైస్కూల్ వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా సుబ్రహ్మణ్యం పాల్గొని పాఠశాల అభివృద్ధికి రూ.10 లక్షలు విరాళాన్ని ప్రకటించారు. గతేడాది పదో తరగతిలో జిల్లాలో నాల్గవ స్థానం సాధించిన పాఠశాల విద్యార్థిని సైరాభానుకు రూ.25వేలు, కీర్తనకు రూ.20 వేలు బహుమతులను డాక్టర్ కడియాల రామారావు జ్ఞాపకార్థం ఆయన సతీమణి అన్నపూర్ణ అందించారు. గ్రామ మాజీ ఉప సర్పంచ్ కాకాని బాబు రూ.10వేలు, స్రవంతి చారిటబుల్ ట్రస్ట్ ఛైర్మన్ వీరమాచనేని సత్యప్రసాద్ రూ.15వేలు అందించిన విరాళాలతో 250 మంది విద్యార్థులకు జ్ఞాపికలు అందజేశారు. ఈ సందర్భంగా పాఠశాల అభివృద్ధి కమిటీ ఛైర్మన్ సుంకర సుభాష్‌చంద్రబోస్‌ను విద్యా కమిటీ ఘనంగా సత్కరించింది. హెచ్‌ఎం నాగేశ్వరరావు ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకలో విశ్రాంతి హెచ్‌ఎం లలతాకామేశ్వరి, మానవత రాష్ట్ర అధ్యక్షుడు మారుబోయిన కోటేశ్వరావు, మాజీ సర్పంచ్ కాకాని అరుణ, వేములపల్లి శ్రీనివాసరావు,హెచ్ ఎంలు కె. విజయ్, లూదర్‌పాల్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన పోషణ పక్వాడ

ఉయ్యూరు, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి) : ఉయ్యూరు నగర పంచాయతీ పరిధి పలు సచివాలయాల్లో నిర్వహించిన కార్యక్రమంలో కేర్ టు యాక్షన్ సంస్థ మేనేజర్ గ్రేస్, డాక్టర్ విద్యాసాగర్ ముఖ్య అతిథులుగా పాల్గొని గర్భిణులు, చంటి పిల్లలు ఆరోగ్యం పట్ల తీసుకోవాలిసిన జాగ్రత్తలు సూచించారు.

హనుమాన్‌జంక్షన్‌రూరల్ : వీరవల్లి అభ్యుదయ పాఠశాల అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం పోషణ్ పక్వాడా ముగింపు కార్యక్రమంలో భాగంగా చిరు ధాన్యాలతో కూడిన ఆహారం వల్ల ఉపయోగాలపై అవగాహన సదస్సు నిర్వహించారు.

హనుమజ్జయంతి ఉత్సవాలపై సమీక్ష

హనుమాన్‌జంక్షన్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి) : స్థానిక అభయాంజనేయ స్వామి దేవ స్థానంలో మే 17 నుంచి 22 వరకు నిర్వహించనున్న హనుమజ్జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు సన్నాహాలు చేపట్టాలని గ్రామపెద్దలు నిర్ణయించారు. మంగళవారం కార్యాలయం ఆవరణలో దేవస్థానం ఈవో పి.తారకేశ్వరావు అధ్వర్యంలో గ్రామ పెద్దలతో సన్నాహక సమావేశం నిర్వహించారు. వేమూరి శ్రీనివాసరావు, మట్టా శ్రీనివాసరావు, వడ్లిల్లి లక్ష్మి, సుంకర సుభాష్ చంద్రబోస్, కొండేటి కనకదుర్గారావు తదితరులు ఉత్సవాలు సందర్భంగా నిర్వ హించాల్సిన కార్యక్రమాలపై చర్చించారు. నిర్వహించాల్సిన కార్యక్రమాలు, ఉత్సవ నిర్వహణకు అవసరమయ్యే బడ్జెట్‌పై ఎండోమెంట్ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి అనుమతి తీసుకోవాల్సి ఉన్నట్లు ఈవో తారకేశ్వరరావు తెలిపారు.

రేషన్ లబ్ధిదారులు ఈకేవైసీ చేయించుకోవాలి

ఉయ్యూరు, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత సంక్షేమ పథకాల ద్వారా లబ్ధిపొం దేందుకు రేషన్ కార్డులోని ప్రతిఒక్క సభ్యుడు ఈ-కేవైసీ తప్పనిసరిగా చేయించుకోవాలని ఉయ్యూరు ఆర్డీఓ హేలా షారోన్ తెలిపారు. రెవెన్యూ డివిజన్ పరిధిలో ఇప్పటి వరకు 20,706 (ఐదేళ్ల కంటే తక్కువ వయసు ఉన్నవారు, 80ఏళ్లు పైబడినవారు మినహాయించి) రేషన్ కార్డు లబ్ధిదారులు ఈ- కేవైసీ చేయించ వలసి ఉందన్నారు. ఈ-కేవైసీ చేయించని వారి పేర్లు సంబంధిత ఎండీయూ/ రేషన్ షాప్ డీలర్ల వద్ద, పౌర సరఫరాల ఉప తహసీల్దార్లు, తహసీల్దార్ల వద్ద ఉంచబడ్డాయని తెలిపారు. బియ్యం కార్డు కలిగిన ప్రతి వారు ఈ-కేవైసీ ప్రక్రియ పూర్తి కాని వారు ఈ నెల 30వ తేదీలోగా తప్పనిసరిగా చేయించుకోవాలని తెలిపారు.


పెనమలూరు : ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా లబ్ధి పొందుతున్న రేషన్ కార్డులోని ప్రతి ఒక్కరూ ఈ నెల 30 నాటికి తప్పనిసరిగా ఈకేవైసీ చేయించుకోవాలని తహసీల్దారు గోపాలకృష్ణ తెలిపారు. ప్రస్తుతం జిల్లాలో సోమవారం వరకు 71,110 మంది రేషన్ కార్డు లబ్దిదారుల ఈకేవైసీ చేయవలసి ఉందని, వారి వివరాలు సంబంధిత ఎండీయూ ఆపరేటర్లు, పౌరసరఫరాల ఉప తహశీల్దారుల వద్ద అందుబాటులో ఉన్నాయని తెలిపారు.

ఉపాధి కూలీల బకాయిలు చెల్లించాలి

ఉంగుటూరు, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి) : గత నాలుగు నెలలుగా పెండింగ్‌లో వున్న ఉపాధి కూలీల వేతన బకాయిలను వెంటనే విడుదల చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు వై.నరసింహారావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం ప్రజాసంఘాల నాయకులతో కలిసి మండలంలోని తేలప్రోలులో ఉపాధి పనులు జరుగుతున్న ప్రదేశాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి తక్షణమే వేతన బకాయిలను విడుదల చేయాలని, లేనిపక్షంలో ఆందోళన బాట పట్టాల్సివస్తుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కౌలురైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు టీవీ లక్ష్మణస్వామి, అజ్మీర వెంకటేశ్వరరావు మాగంటి సాంబశివరావు, టీవీ రామ్మోహనరావు, చౌటుపల్లి ప్రభాకర్, ఉపాధి కూలీలు పాల్గొన్నారు.

గన్నవరం : ఉపాధి కూలీలకు పెండింగ్‌లో ఉన్న రెండు నెలల బకాయిలు వెంటనే చెల్లించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సెక్రటరీ పవన్ డిమాండ్ చేశారు. మంగళవారం మండలంలోని చనుపల్లివారిగూడెంలో ఉపాధి కూలీలను కలిసి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పవన్ మాట్లాడుతూ.. పాలకులు మాటల్లో కాకుండా చేతల్లో ఉపాధి కూలీలకు వారానికి ఒకసారి కూలీ వేతనం చెల్లించాలన్నారు. రోజు వేతనం రూ.600 వచ్చేలా చూడాలన్నారు. వేసవి కావడంతో పనులు చేసే చోట మౌలిక వసతులు కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో రాంబాబు, వెంకటేశ్వరరావు, తాతబ్బాయి పాల్గొన్నారు.

హనుమాన్‌జంక్షన్‌రూరల్ : ఉపాధిహామీ పథకం ద్వారా గ్రామాల్లో చెరువుల పూడికతీత, గట్లను బలపరచడం ద్వారా గ్రామాభివృద్ధితో పాటు కూలీలకు పనిదినాలు కల్పించడం జరుగుతోందని టీడీపీ నాయకుడు చింతల వెంకట శివఅప్పారావు అన్నారు. కానుమోలులో రూ.4లక్షల నిధులతో చెరువు పూడికతీత పనులను మంగళవారం ఆయన పరిశీలించారు. ఏలూరు కాలువ ద్వారా నీటిని నింపేందుకు ముందు చర్యగా గుర్రపుడెక్క తొలగించి గట్లను బలోపేతం చేయడం జరుతుందని కార్యదర్శి వివరించారు. సన్నీ, దుర్గారావ పాల్గొన్నారు.



ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న పవన్

పాడిరైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



పశువైద్యశిబిరం ప్రారంభిస్తున్న నాయకులు

ఉంగుటూరు, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి) : పాడిరైతుల సంక్షేమమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న పలు రకాల పథకాలను పశుపోషకులందరూ సద్వినియోగం చేసుకోవాలని టీడీపీ గ్రామ అధ్యక్షుడు మున్నా రామకృష్ణ అన్నారు. గన్నవరం ఎన్టీఆర్ పశు వైద్యకళాశాల ఎన్‌ఎస్‌ఎస్ విభాగం ఆధ్వర్యంలో మండలంలోని పెదఅవుటపల్లి పశువైద్యశాలలో మంగళవారం ఉచిత పశు వైద్యశిబిరం నిర్వహించారు. పశుసంవర్థకశాఖ ఏడీ డాక్టర్ ఎం.బాలకృష్ణ, ఎన్టీఆర్ పశువైద్యకళాశాల ప్రొఫెసర్ డాక్టర్ ఎం.శ్రీనివాస్, ఆత్కూరు పశువైద్యాధికారి డాక్టర్ ఎస్.నాగార్జున, పశువైద్యులు లక్ష్మీరాణి, కమలాకర్, సుధాకర్‌రెడ్డి, మల్లికార్జున, బిందు కిరణ్మయి, నాగార్జున, జేవీవో వెంకటరామయ్య పాల్గొన్నారు.



ప్రపంచ ధరిత్రీ దినోత్సవం సందర్భంగా వీఆర్ సిద్ధార్థ విద్యార్థుల ర్యాలీ

పర్యావరణంపై అవగాహన ర్యాలీ

పెనమలూరు, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి) : ప్రపంచ ధరిత్రీ దినోత్సవం సందర్భంగా స్థానిక వీఆర్ సిద్ధార్థ కళాశాల విద్యార్థులు యూనివర్సిటీలోని ఎకో క్లబ్ ప్రాంగణం నుంచి తాడిగడప వందడుగుల రోడ్డు వరకు అవగాహన ర్యాలీ నిర్వహించారు. పర్యావరణం, పచ్చదనంపై స్థానికులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎకో క్లబ్ కన్వీనర్ డాక్టర్ చాగర్లమూడి కవిత, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ కొల్లా నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.



రైతుల కష్టం.. దళారుల భోజ్యం..!



గన్నవరం మండలంలో ప్రారంభించని ధాన్యం కొనుగోలు కేంద్రాలు ● అధికారులు, మిల్లర్లు సిండికేట్ అయ్యారని రైతుల ఆరోపణ

గన్నవరం మండలంలో సూరంపల్లి, ముస్తాబాద, కేసరపల్లి ప్రాంతాల్లో 500 ఎకరాల్లో రైతులు దాళ్వా సాగుచేశారు. పంట చేతికొచ్చి కల్లాల్లో ఉంది. కొనుగోలు కేంద్రాలు ప్రారంభించి ధాన్యం కొనుగోలు చేయమని రైతులు అధికారుల చుట్టూ తిరుగుతున్నారు. కనీసం సంచులన్నా ఇస్తే ఎత్తి పక్కన పెట్టుకుంటామన్నా ఇవ్వటం లేదని చెబుతున్నారు. వాతావరణంలో మార్పులు వస్తుండటంతో భయాందోళన చెందుతున్నామని, అకాల వర్షం వస్తే పంటంతా వర్షార్పణమవుతుందని చెబుతున్నారు. అయితే ధాన్యం కొనుగోలుకు మిల్లర్లు ముందుకు రావటం లేదని అధికారులు చెబుతున్నారు. కొనుగోలు కేంద్రాన్ని వ్యవసాయ, రెవెన్యూ, సివిల్ సప్లై అధికారులు ప్రారంభించాల్సి ఉంది. ధాన్యం కొనుగోలు చేస్తామని కాగితాలిచ్చి ఈరోజు, రేపు అంటూ కాలయాపన చేస్తున్నారని రైతులు మండిపడుతున్నారు. ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించకపోవటంతో దళారులను ఆశ్రయించటం తప్పటం లేదని, ఎన్ని రోజులు పంటను కల్లాల్లో పెట్టి కాపల కాస్తామని అంటున్నారు. ఎకరానికి రూ.35వేలు ఖర్చయిందని దళారులకు ధాన్యం వేయటంతో సుమారు మరో రూ.10వేలు నష్టపోతామంటున్నారు.

అధికారులు పట్టించుకోవటం లేదు..

మాలావతు రూప్‌బాబు, కౌలు రైతు



అధికారులు పట్టించుకోవటం లేదు. సరైన సమాచారం ఇవ్వటం లేదు. పంట కోసి రెండు వారాలవుతోంది. అదేమంటే మిల్లర్లు సంచులివ్వటం లేదని చెబుతున్నారు. మిల్లర్లు, అధికారులు సిండికేట్ అయ్యారని తెలుస్తోంది. కనీసం సంచులన్నా ఇస్తే ఎత్తి పక్కన పెట్టుకుంటామని. వాతావరణం బాగాలేదని చెప్పినా వినలేదు.

ధాన్యం కొనుగోలు చేయాలి

మాగంటి ప్రభాకరరావు, రైతు



ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాలి. ఆరుగాలం కష్టపడి పండించిన పంట తక్కువకి అమ్మాలంటే బాధేస్తోంది. ప్రభుత్వం ధాన్యం కొనుగోలు చేయమని చెప్పి నెల రోజులవుతోంది. అధికారులు వెంటనే చర్యలు తీసుకుని రైతులకు న్యాయం చేయాలి.

దళారుల దెబ్బకు దాళ్వా రైతులు కుదేలవుతున్నారు. ధాన్యం కొనుగోలు చేయమని ప్రభుత్వం నెలక్రితం ప్రకటించినా గన్నవరం మండలంలో ప్రారంభానికి నోచుకోలేదు. రైతులు ధాన్యం కోసి రెండు వారాలకు పైనే అవుతోంది. అధికారులు పట్టించుకోవటం లేదని, మిల్లర్లతో సిండికేట్ అయ్యారని రైతులు ఆరోపిస్తున్నారు. ప్రభుత్వం 75 కేజీల ధాన్యం బస్తా రూ.1750 ప్రకటించింది. అధికారులు కొనుగోలు కేంద్రాలను ప్రారంభించకపోవటంతో దళారులు రూ.1250 నుంచి రూ.1450 వరకు కొంటున్నారు. రూ.300 నుంచి రూ.500 వరకు రైతులు నష్టపోతున్నారు.

- గన్నవరం, ఆంధ్రజ్యోతి



ఏఐఐబీ ప్రతినిధులను సత్కరిస్తున్న మండలి బుద్ధప్రసాద్

దివి ప్రాంతంలో ఏఐఐబీ ప్రతినిధుల పర్యటన

● గొల్లమంద రహదారికి నిధులు కేటాయించినందుకు ఎమ్మెల్యే బుద్ధప్రసాద్ కృతజ్ఞతలు

అవనిగడ్డ, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ పరిధిలోని దివి గ్రామాల సమూహమైన ఎదురుమొండి దీవుల్లో ఏఐఐబీ ప్రతినిధులు మంగళవారం పర్యటించారు. సముద్రపు అటుపోట్ల వేగం కారణంగా ఎదురుమొండి దీవుల పరిధిలోని ఎదురుమొండి-గొల్లమంద రహదారి మొత్తం నదిలో కలిసిపోవటంతో ఈ ప్రాంత ప్రజలు పడుతున్న ఇబ్బందులను ఏఐబీ ప్రతినిధులు స్వయంగా పరిశీలించారు. సముద్రపు అటుపోట్ల నుంచి రహదారికి రక్షణ కల్పించేలా మొండిలు ఏర్పాటుతోపాటు రహదారి అభివృద్ధికి ఏషియా ఇన్‌ఫ్రాసెక్చర్ ఇన్వెస్టిమెంట్ బ్యాంక్ రూ.13.45 కోట్ల నిధులను కేటాయించగా, ఎదురుమొండి దీవుల వాసులు తమ ప్రాంతానికి వచ్చిన ఏఐబీ ప్రతినిధులను కలిసి రహదారి సమస్య కారణంగా తాము పడుతున్న ఇబ్బందులను వివరించారు. ఎమ్మెల్యే బుద్ధప్రసాద్ తనయుడు మండలి వెంకట్రామ్ నేతృత్వంలో గ్రామస్థులు ఏఐబీ ప్రతినిధులను ఘనంగా సత్కరించారు. అనంతరం పులిగడ్డ ఇరిగేషన్ వసతిగృహంలో ఎమ్మెల్యే బుద్ధప్రసాద్‌ను కలిసి తమ పర్యటన వివరాలను వివరించారు.ఈ సందర్భంగా బుద్ధప్రసాద్ మాట్లాడుతూ గొల్లమంద రహదారి పరిస్థితిని కలెక్టర్ బాలాజీ డ్రోన్ విజువల్స్ తీయించి పంపించటంతో ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఈ సమస్య పరిష్కారానికి చొరవ చూపించారన్నారు. ఇప్పటికే రహదారి నిర్మాణానికి టెండర్లు పిలిచారని, ఈ నిధులతో ఎదురుమొండి - గొల్ల మంద గ్రామాల మధ్య భూ సేకరణతోపాటు రోడ్డు నిర్మాణం జరుగుతుందని తెలిపారు. ఏఐబీ ప్రాజెక్టు టీమ్ లీడర్ పవన్ కార్కీ, బ్యాంక్ సీనియర్ కన్సల్టెంట్ డాక్టర్ అశోక్ కుమార్, బ్యాంక్ సోషల్ ఎక్స్‌పర్ట్ శివరామకృష్ణ, బ్యాంక్ ఫైనాన్స్ ఎక్స్‌పర్ట్ యోగీష్, బ్యాంక్ ఎన్విరాన్మెంటల్ ఎక్స్‌పర్ట్ మాయా, బ్యాంక్ ప్రొక్యూరెమెంట్ స్పెషలిస్ట్ లార్లా, పంచాయతీ రాజ్ ప్రాజెక్టు డీఈఈ నాగరాజు, ఏఈఈ రాజశేఖర్ రెడ్డి పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో యువకుడి మృతి



గుడివాడ రూరల్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): బాలుడిని కాపాడబోయిన ఓ యువకుడు విద్యుదాఘాతానికి గురై మృతి చెందిన ఘటన గుడివాడ రూరల్ మండలం టిడ్కో కాలనీలో మంగళవారం ఉదయం జరిగింది. టిడ్కో కాలనీలో నారి సతీష్ అనే బాలుడు గ్యాస్ పొయ్యి తెచ్చే క్రమంలో జీఏ వైర్లు తగిలి విద్యుత్‌షాక్ కొట్టింది. వెంటనే దొండపాటి రవితేజ (27) అనే యువకుడు బాలుడిని రక్షించే క్రమంలో ఆ వైరు వచ్చి రవితేజ వీపుపై పడింది. దీంతో ఇతడికీ షార్ట్ సర్క్యూట్ తగిలింది. ఆ పక్కనే ఉన్న కొవ్వూరు నాగరాజు, రామస్వామి, షేక్ మస్తాన్ వైరును తప్పించే ప్రయత్నం చేయగా వారికీ షాక్ కొట్టగా గుడివాడ ఏరియా ఆసుపత్రికి తరలించారు. అప్పటికే రవితేజ మరణించినట్టు వైద్యులు ధ్రువీకరించారని ఎస్ఐ చంటిబాబు తెలిపారు. విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం వల్లే టిడ్కో కాలనీలో తరచూ ప్రమాదాలు జరుగుతున్నట్టు వాపోతున్నారు. రకరకాల వైర్లు విద్యుత్ స్తంభాలకు కట్టడంతో ఏది విద్యుత్ వైరో, ఏది కేబుల్ వైరో తెలియక వర్షాలకు, గాలికి తెగి పడటంతో ప్రాణాలు పోతున్నాయని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కాలనీవాసులు కోరుతున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఏపీటీడీసీ బస్సులో బాలికపై అసభ్య ప్రవర్తన

- మద్యం మత్తులో అనధికార ప్రయాణికుడి వికృత చేష్టలు
- తమిళనాడు నుంచి తిరుపతికి వచ్చే బస్సులో ఘటన
- తమిళనాడు సీఎం స్టాలిన్ ఆగ్రహం
- మెయిల్ ద్వారా ఓ మోటార్ కంపెనీ అధినేత ఫిర్యాదు
- విచారణకు ఆదేశించిన ఏపీటీడీసీ ఎండీ
- బాధ్యులను విజయవాడకు పిలిపించి విచారణ

విజయవాడ, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ పర్యాటకాభివృద్ధి సంస్థకు (ఏపీటీడీసీ) చెందిన బస్సులో తమిళనాడు బాలిక పట్ల ఓ అనధికార ప్రయాణికుడు అసభ్యంగా ప్రవర్తించటంతో తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. తమిళనాడు నుంచి తిరుపతికి రెగ్యులర్‌గా ఏపీటీడీసీ బస్సులను నడుపుతోంది. తమిళనాడు రిజిస్ట్రేషన్ కలిగిన ఏపీటీడీసీకి చెందిన టీఎన్07ఏబీ8229 నంబరు బస్సు కోయంబత్తూరు నుంచి తిరుపతికి యాత్రికులను తీసుకు వస్తుంటుంది. కొద్ది రోజుల కిందట తమిళనాడుకు చెందిన ఒక మోటార్ కంపెనీ అధినేత బంధువులు కుటుంబ సమేతంగా ఈ బస్సులో ప్రయాణించారు. బస్సు కెపాసిటీ 35 సీట్లు అయినప్పటికీ సగం బస్సు ఖాళీగా ఉంది. వెనుక సీట్లు ఖాళీగా ఉండటంతో ఆ కుటుంబానికి చెందిన తొమ్మిదేళ్ల బాలిక ఆ సీట్లలో పడుకుంది. కాసుల కక్కుర్తితో మార్గమధ్యంలో టూర్ ప్యాకేజీతో సంబంధం లేని ఒక వ్యక్తిని ఏపీటీడీసీ సిబ్బంది బస్సులో ఎక్కించుకున్నారు. అతను మద్యం సేవించినట్టు తెలుస్తోంది. బస్సులో అందరూ నిద్రిస్తుండగా.. ఆ వ్యక్తి వెనుక సీట్లో పడుకున్న బాలిక పట్ల అసభ్యంగా ప్రవర్తించాడు. ఆ బాలిక కేకలు వేయడంతో సిబ్బంది ఆ వ్యక్తిని బస్సు నుంచి దించివేశారు. అయితే, ఈ విషయం చాలా రోజుల వరకు బయటకు రాలేదు. బాలిక బంధువైన ఓ మోటార్ కంపెనీ అధినేతకు ఈ విషయం తెలిసి ఏపీఎస్ఆర్టీసీ ఉన్నతాధికారులకు ఈ-మెయిల్‌లో ఫిర్యాదు చేశారు. తమిళనాడు సీఎం స్టాలిన్ దృష్టికి కూడా ఆయన తీసుకువెళ్లడంతో ఘటనపై ఆగ్రహం వ్యక్తం చేసిన స్టాలిన్ స్థానికంగా విచారణకు ఆదేశించినట్టు తెలిసింది. మరోవైపు తమిళనాడు రిజిస్ట్రేషన్ బస్సు లేవీ తమవద్ద లేవని, అది ఏపీటీడీసీ బస్సు అని ఏపీఎస్ఆర్టీసీ ఎండీ గుర్తించి ఆ మెయిల్‌ను ఏపీటీడీసీకి ఎండీకి ఫార్వర్డ్ చేశారు. దీంతో ఏపీటీడీసీ ఎండీ కూడా విచారణకు ఆదేశించారు. తిరుపతి యూనిట్‌కు చెందిన బాధ్యులైన బస్సు డ్రైవర్లు, ఇతర సిబ్బందిని విజయవాడలో విచారణకు హాజరు కావాల్సిందిగా ఆదేశించారు. డ్రైవర్లను సస్పెండ్ చేసే అవకాశం ఉందని తెలుస్తోంది.

పెట్టుబడిదారీ వ్యవస్థకు ప్రత్యామ్నాయం ఎర్రజెండా

● లెనిన్ జయంతి సభలో వక్తలు

గవర్నర్‌పేట, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): సామ్రాజ్యవాదం, పెట్టుబడిదారీ వ్యవస్థకు ఎర్రజెండా మాత్రమే ప్రత్యామ్నాయమని పలువురు వక్తలు అభిప్రాయపడ్డారు. సోషలిస్టు రాజ్య స్థాపకుడు వీఐ లెనిన్ జయంతిని పురస్కరించుకుని మార్క్స్, ఎంగిల్స్, లెనిన్ విగ్రహ కమిటీ ఆధ్వర్యంలో వామపక్ష నేతలు మంగళవారం గవర్నర్‌పేట లెనిన్ విగ్రహం వద్ద పూలరింగును ఉంచి నివాళులర్పించారు. వామపక్ష నేతలు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కే రామకృష్ణ మాట్లాడుతూ సోవియట్‌లో నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా రైతుల సాయుధ పోరాటం చేసి విజయం సాధించి సుదీర్ఘకాలం ఎర్రజెండా పాలన చేసిన ఘనత లెనిన్‌దేనన్నారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు సీహెచ్ బాబూరావు మాట్లాడుతూ అమెరికా అధ్యక్షుడు ట్రంప్ సాగిస్తున్న ఆర్థిక అరాచకం వల్ల దేశంలో ఉత్పత్తి అవుతున్న ఆక్వా, మిర్చి వంటి వాటికి ధరలు సరిగా లేక రైతులు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. న్యూ డెమోక్రసీ పార్టీ రాష్ట్ర కార్యదర్శి పీ ప్రసాద్ మాట్లాడుతూ మార్క్స్ సిద్ధాంతాలు, లెనిన్ పోరాటం స్ఫూర్తితో ముందుకు సాగాలని వామపక్షాలకు పిలుపు నిచ్చారు. సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జేవీ సత్యనారాయణ, పాపులర్ సంస్థ అధినేత చుక్కపల్లి విజయ్‌కుమార్, విశ్రాంత ఆచార్యుడు సీ నరసింహారావు, సీపీఐ నగర కార్యదర్శి జీ కోటేశ్వరరావు, నేతలు పంచదార్ల దుర్గాంబ, జమలయ్య, సూర్యారావు, వివిధ సంఘాల ప్రతినిధులు దివికుమార్, లక్ష్మయ్య, ఖై చెంచయ్య, సుబ్బరావమ్మ, అక్కినేని చంద్రారావు, అరసం ప్రతినిధి అరుణ్‌కుమార్ పాల్గొన్నారు.



లెనిన్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న వామపక్ష నేతలు



రేషన్ ఇవ్వలేదని కార్డులు చూపుతున్న గ్రామస్థులు

మాకు రేషన్ ఇవ్వలేదు

● లబ్ధిదారుల ఆందోళన● కొరతే కారణమంటున్న డీలర్లు

మోపిదేవి, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): జాతీయ ఆహార భద్రత చట్టంలో భాగంగా అర్హులైన ప్రతీ పేదవాడికి అందాల్సిన రేషన్ సరుకులు మోపిదేవి మండలంలో ఏప్రిల్ నెలకు సంబంధించి పలు గ్రా మాల్లో లబ్ధిదారులకు అందలేదు. మోపిదేవి మండలంలోని 26రేషన్ దుకాణాలుండగా, 11, 651 మంది రేషన్‌కార్డులు కలిగి ప్రభుత్వ సరుకులకు అర్హత కలిగి ఉన్నారు. ఈ నెల 20వ తేదీతో రేషన్ సరుకుల గడువు ముగిసింది. అప్పటికి 9,7 24 కార్డుదారులకు సరుకులు ఇచ్చారు. 1927 మంది కార్డుదారులకు అం దించలేదు. మండలంలోని మోపిదేవి, శివరామపురం, కోసూరువారిపాలెం, నాగాయితిప్ప, ఉత్తర చిరువోలులంక, అయోధ్య, మెరకనపల్లి, కొక్కిలిగడ్డ, కె.కొత్తపాలెం గ్రామాల్లో వందల సంఖ్యలో లబ్ధిదారులకు సరుకులు ఇవ్వలేదు. ఎందుకివ్వలేదని ఎండీయూ ఆపరేటర్, రేషన్ డీలర్లను ప్రశ్నించగా, ప్రభుత్వం నుంచి సరుకులు తక్కువగా వచ్చినందున ఇవ్వలేకపోయామని, మరో రెండు రోజుల్లో అందిస్తామని మూడు రోజులుగా చెబుతున్నట్టు లబ్ధిదారులు తెలిపారు. ఈ విషయాన్ని డీలర్లు తహసీల్దార్ కార్యాలయానికి సమాచారం ఇచ్చినట్టు తెలిపారు. జనవరి నుంచి ఏప్రిల్‌లో దుకాణాలకు సరుకు రవాణా చేయటంలో డీలర్ల వద్ద ఉన్న ముగింపు నిల్వ, ప్రారంభ నిల్వలను సరి చేసుకుని సరుకులు అందించటం వల్లే కొరత సమస్య వచ్చినట్టు పలువురు డీలర్లు చెబుతున్నారు. వారివద్ద ఉన్న ముగింపు నిల్వ ఆధారంగా ఏప్రిల్‌కు సరుకులు అందించటం జరిగిందని, తేడాలు వచ్చే సమస్యే లేదని మరి కొంతమంది చెబుతున్నారు. డీలర్లు, ఎండీయూ వాహనదారులు, అధికారుల మధ్య సమన్వయం లేకపోవటంతో లబ్ధిదారులకు సరుకులు దూరమయ్యాయని, ఇప్పటికైనా జిల్లా అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

కోనేరుసెంటర్ మీదుగా ఆర్టీసీ బస్సు నడపాలి

మచిలీపట్నం టౌన్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): విజయవాడకు వెళ్లే ఆర్టీసీ బస్సు సర్వీసులను కోనేరుసెంటర్ మీదుగా నడపాలని మచిలీపట్నం పట్టణ పౌర సంక్షేమ సంఘం నేత కొడాలి శర్మ డిమాండ్ చేశారు. ఆర్టీసీ డిపో వద్ద మంగళవారం జరిగిన రౌండ్‌టేబుల్ సమావేశంలో కొడాలి శర్మ మాట్లాడారు. విజయవాడ వెళ్లేందుకు ప్రయాణికులు మూడు స్తంభాల సెంటర్‌కు గానీ, ఆర్టీసీ బస్టాండ్‌కు గానీ వెళ్లవలసి వస్తోందన్నారు. సుదూర ప్రాంతాల నుంచి కోనేరుసెంటర్‌కు వచ్చేవారు ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. సీఐటీయూ జిల్లా నేత చంద్రపాల్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఎం పోలినాయుడు, కేవీ గోపాలరావు, జీ కిషోర్‌కుమార్, నాగయ్య, ఎండీ యూనస్, సీహెచ్ విజయలక్ష్మి, బీ సుబ్రహ్మణ్యం, సీహెచ్ జయరావు పాల్గొన్నారు.

కేయూ క్యాంపస్ ఇంటర్వ్యూల్లో 37 మంది ఎంపిక

మచిలీపట్నం టౌన్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): కృష్ణా విశ్వవిద్యాలయంలో మంగళవారం హెరిటో ల్యాబ్స్ నిర్వహించిన క్యాంపస్ ఇంటర్వ్యూల్లో 37 మంది విద్యార్థులు ఎంపికయ్యారు. మంగళవారం రవీంద్రనాథ్‌ఠాగూర్ సెమినార్ హాల్‌లో నిర్వహించిన ప్రాంగణ ఎంపికలకు 96 మంది హాజరయ్యారు. వీరిలో ఫార్మసి 13, రసాయనశాస్త్ర విభాగ విద్యార్థులు 24 మంది ఎంపికయ్యారు. ఈ సందర్భంగా ఉపకులపతి ఎంపికైన విద్యార్థులను అభినందిస్తూ మాట్లాడారు. రెక్టార్ బసవేశ్వరరావు, రిజిస్ట్రార్ ఉష, రసాయన శాస్త్ర విభాగాధిపతి సుజాత, కిషోర్ పాల్గొన్నారు. కాగా కృష్ణావిశ్వవిద్యాలయంలో ఎన్‌సీసీ విద్యార్థుల ఆధ్వర్యంలో ధాత్రి దినోత్సవం జరిగింది. ఎన్‌సీసీ అధికారి డీ రామశేఖరరెడ్డి పాల్గొన్నారు. అంబేద్కర్ జయంతి నిర్వహించిన పోటీల్లో విజేతలకు వీసీ కూన రాంజీ బహుమతులు అందించారు.

సీనియర్ సిటిజన్ కార్డు కోసం

సచివాలయంలో దరఖాస్తు

● వెరిఫికేషన్ అనంతరం పీడీఎఫ్ ఫార్మెట్‌లో కార్డు జారీ

బెంజిసర్కిల్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): మీకు 60 ఏళ్లు నిండాయా.. అయితే సీనియర్ సిటిజన్ కార్డుకు దరఖాస్తు చేసుకోవచ్చు. దీనికోసం ఎక్కడికో వెళ్లనక్కరలేదు. సమీపంలోని వార్డు, గ్రామసచివాలయాల్లో వెళ్లి దరఖాస్తు చేసుకుంటే సరిపోతుంది. వెరిఫికేషన్ అనంతరం సీనియర్ సిటిజన్ కార్డు స్వంతం చేసుకోవచ్చు. 60 ఏళ్లు నిండినవారు తమ సమీపంలోని వార్డు లేదా గ్రామసచివాలయాలకు వెళితే అక్కడ సిబ్బంది ఒక దరఖాస్తు ఫారం ఇస్తారు. దాన్ని నింపి ఒక పాస్‌పోస్టు సైజ్ ఫొటో, ఆధార్‌కార్డు ఇవ్వాలి. పుట్టిన తేదీ, అడ్రస్ నిర్ధారణకు ఆధార్ కార్డు సరిపోతుంది. స్వయంగా సీనియర్ సిటిజనే సచివాలయానికి వెళితే పాస్‌పోర్టు సైజ్ ఫొటో కూడా అక్కరలేదు. సిబ్బందే డిజిటల్ ఫొటో తీస్తారు. అయితే సీనియర్ సిటిజన్‌కు హౌస్‌హోల్డ్ సర్వే పూర్తయిఉండాలి. లేదంటే అనర్హులు. వెళ్లేటప్పుడు రిజిస్టర్ మొబైల్ ఫోన్ తీసుకువెళ్లాలి. దానికే ఓటీపీ వస్తుంది. ఈ ప్రొసెస్ చేసినందుకు రూ.40చెల్లించి రసీదు పొందాలి. ఈ డబ్బులు రాష్ట్ర ప్రభుత్వం ఖజానాలో జమవుతాయి. ప్రొసెస్ పూర్తయ్యాక సీనియర్ సిటిజన్ కార్డు మీస్వంతం.

డీఎస్సీ, ఏపీపీఎస్సీ పరీక్షల తేదీలు మార్చాలి

బెంజిసర్కిల్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): నిరుద్యోగ యువతకు ఇబ్బంది లేకుండా రాష్ట్రప్రభుత్వం డీఎస్సీ, ఏపీపీఎస్సీ పరీక్షల తేదీ ల్లో మార్పులు చేయాలని రాష్ట్ర నిరుద్యోగ జేఏసీ అధ్యక్షుడు సమ యం హేమంత్ కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో విజ్ఞప్తి చే శారు. ఈమేరకు మంత్రి లోకేశ్‌కు లేఖ రాసినట్టు తెలిపారు. జూన్ 16 నుంచి జూలై 16 వరకు డీఎస్సీ, జూన్ 16 నుంచి 26 వరకు ఏపీపీఎస్సీ వారు పరీక్షలు నిర్వహిస్తూ షెడ్యూల్‌ను విడుదల చేశారన్నారు. ఒకేరోజు రెండు పరీక్షలు షెడ్యూల్ పడితే అభ్యర్థులు నష్టపోయే అవకాశముందన్నారు. ప్రభుత్వం దృష్టిసారించాలని కోరారు.



అధికారులతో సమావేశమైన కలెక్టర్ లక్ష్మీశ

నీట్ పరీక్షకు పకడ్బందీ ఏర్పాట్లు

● ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ

కలెక్టరేట్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): నీట్ పరీక్షకు అన్ని ఏర్పాట్లు పూర్తిచేసి పరీక్ష కేంద్రాలను సిద్ధం చేయాలని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ లక్ష్మీశ అధికారులను ఆదేశించారు. మే 4న నిర్వహించే నీట్ (నేషనల్ ఎలిజిబిలిటీ కమ్ ఎంట్రన్స్ టెస్ట్) పరీక్షకు చేపట్టాల్సిన ఏర్పాట్లపై మంగళవారం కలెక్టర్ లక్ష్మీశ కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలో ఈ పరీక్షకు సుమారు 13వేల మంది అభ్యర్థులు హాజరుకానున్నారన్నారు. మే 4న ఆదివారం మధ్యాహ్నం 2 నుంచి 5 గంటల వరకు పరీక్ష నిర్వహిస్తారన్నారు. పరీక్ష నిర్వహణకు నగర పరిధిలో 28 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. వేసవిని దృష్టిలో పెట్టుకొని పరీక్షా కేంద్రాల వద్ద ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని, తాగునీటికి ఇబ్బంది లేకుండా చూడాలని ఓఆర్ఎస్ ప్యాకెట్లను అందుబాటులో ఉంచాలని సూచించారు. విద్యార్థులు పరీక్ష రాసేందుకు వీలుగా ఫర్నీచర్, తాగునీరు, విద్యుత్ సరఫరాకు అంతరాయం లేకుండా ముందస్తు ఏర్పాట్లు చేయాలన్నారు. డీఈవో యూవీ సుబ్బారావు, కేంద్రీయ విద్యాలయ ప్రిన్సిపల్, సిటీ కో-ఆర్డినేటర్ ఎస్.ఆదిశేష శర్మ, వైస్ ప్రిన్సిపాల్ పాల్గొన్నారు.

గుర్తు తెలియని బ్యాగ్‌లో

నగదు, బంగారం, వెండి వస్తువులు



రైల్వేస్టేషన్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): విజయవాడ రైల్వే స్టేషన్ ప్లాట్‌ఫారం-1 లోని క్లోక్‌రూమ్‌లో ఎవరో గుర్తు తెలియని వ్యక్తి కొంతకాలం కిందట ఒక గ్రేబ్లాక్ రంగుతో ఉన్న బ్యాగ్‌లో రూ.9, 70,200 నగదు, మరికొన్ని బంగారం, వెండి వస్తువులు ఉన్నట్లు రైల్వే పోలీసులు గుర్తించారు. సాధారణ తనిఖీల్లో భాగంగా మంగళవారం రైల్వే డాగ్ స్క్వాడ్‌లోని జూలియా జాగిలం ఒకటో నెంబరు ప్లాట్‌ఫారం ఉత్తరం వైపున్న సామగ్రి భద్రపరిచే క్లోక్‌రూమ్‌లోకి ప్రవేశించింది. అనుమానిత బ్యాగ్ దగ్గర ఆగిపోవటంతో పోలీసులు బ్యాగ్‌ను స్వాధీనం చేసుకున్నారు. బ్యాగ్‌పై 3463 టోకెన్ నెంబరు ఉంది కానీ, ఎవరిదన్నది తెలియరాలేదు. క్లోక్‌రూమ్‌లోని గుమస్తాను అడగ్గా ఈనెల 10వ తేదీ నుంచి ఆ బ్యాగ్ ఉందని, ఊరు, పేరు తెలియదని సమాధానం చెప్పాడు. పోలీసులు బ్యాగ్‌ను స్వాధీనం చేసుకుని తదుపరి చర్యలు నిమిత్తం మధ్యవర్తుల సహాయంతో పోలీసు స్టేషన్‌కు తరలించారు. ఏపీ రైల్వే డీఐజీ బి.సత్య ఏసుబాబు ఉత్తర్వుల మేరకు రైల్వే విజయవాడ జిల్లా ఎస్పీ రాహుల్ దేవ్ సింగ్ ఆదేశాల మేరకు డిప్యూటీ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీసు జి.రత్నరాజు పర్యవేక్షణలో సీఐ జేవీ రమణ ఆధ్వర్యంలో జీఆర్‌పీ సిబ్బంది, ఆర్‌పీఎఫ్ సీఐ అలీబేగ్, సీఐడీ ఇన్‌స్పెక్టర్ మధుసూదన్, ఎస్ఐ మకత్‌లాల్ స్టేషన్‌లో గత కొద్ది రోజులుగా విస్తృత తనిఖీలు చేస్తున్నారు. ఈ క్రమంలో తాజాగా 16 మంది పాత నేరస్థులను గుర్తించి పట్టుకున్నారు. మరో ఘటనలో క్లోక్‌రూమ్‌లో భారీ మొత్తంలో డబ్బు, వెండి, బంగారు వస్తువులు గల గుర్తుతెలియని వ్యక్తి బ్యాగ్‌ను గుర్తించటం విశేషం. పోలీసు జాగిలం సహకారంతో ఇటువంటి మరికొన్ని ప్రక్రియలు చేసే అవకాశం ఉంది.



ర్యాలీలో పాల్గొన్న సీపీఎం నేతలు, శ్రేణులు

రాయితీల పేరుతో రైడింగ్ యాప్‌ల మోసం

● సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు బాబూరావు

విజయవాడఐ/సత్యనారాయణపురం, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): ఓలా, ఉబర్, రాపిడో వంటి బడా సంస్థలు యాప్‌ల పేరుతో ఒకవైపు ప్రయాణికులను, మరోవైపు ఆటో కార్మికులను దోచుకుంటున్నాయని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు సీహెచ్ బాబూరావు అన్నారు. మంగళవారం బీఆర్టీఎస్ రోడ్డులో సీఐటీయూ అనుబంధ సంస్థ సిటీ ఆటోవర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో వందలాది ఆటోలను నిలిపి కార్మికులు ఆందోళన ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఫుడ్ జంక్షన్ వద్ద ఏర్పాటు చేసిన సభలో బాబూరావు మాట్లాడుతూ ప్రభుత్వాలు కార్మికుల గొంతు కోస్తూ బడా సంస్థలకు మద్దతు తెలపడం బాధాకరమన్నారు. ప్రైవేటు కంపెనీలకు లాభాల కట్టబెట్టేందుకు ప్రభుత్వాలు ఇలాంటి ఒప్పందాలు చేసుకోవడం వల్ల అధికార దుర్వినియోగం అవుతుందని, తక్షణమే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఈ సంస్థలకు చెందిన యాప్‌లను నిషేధించాలని ప్రభుత్వాన్ని కోరారు. అనంతరం సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కాశీనాథ్ మాట్లాడుతూ ఆటో కార్మికులందరికీ వాహన మిత్ర పథకం ద్వారా గత ప్రభుత్వం ఇచ్చిన రూ.10వేలను రూ.15వేలకు పెంచుతామని హామీ ఇచ్చిన కూటమి ప్రభుత్వం 10 నెలలు గడిచినా నోరు మెదపడం లేదని విమర్శించారు. ర్యాలీలో సీపీఎం కార్యవర్గ సభ్యుడు దుర్గారావు, హనుమంతరావు, రూబేన్, కరీముల్లా, దుర్గావళి, కోటయ్య, తిరుపతయ్య, భాస్కర్, చిన్న పాల్గొన్నారు.

బైక్‌ల చోరీ కేసులో ముగ్గురి అరెస్టు

రూ.10 లక్షల విలువైన 22 ఎలక్ట్రిక్ బైక్‌ల స్వాధీనం

గుణదల, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): మోటారు సైకిల్ దొంగతనాలు చేసే అనుమానితులపై మాచవరం పోలీసులు పూర్తి నిఘా పెట్టడంతో ముగ్గురు నిందితులు పట్టుబడ్డారని వారి నుంచి రూ.10లక్షల విలువైన 22 ఎలక్ట్రిక్ బైక్‌లు స్వాధీనం చేసుకున్నట్టు సెంట్రల్ జోన్ ఏసీపీ దామోదర్ తెలిపారు. మాచవరం పోలీస్ స్టేషన్లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనర్ ఎస్వీ రాజశేఖర్‌బాబు ఆదేశాలతో నగరంలో మోటారు సైకిళ్ల చోరీలకు పాల్పడే వారిపై నిఘా ఏర్పాటు చేశామన్నారు. ఈక్రమంలోనే మాచవరం సీఐ ప్రకాష్ సిబ్బందితో సోమవారం వాహనాల తనిఖీ చేస్తుండగా ముగ్గురు యువకులు తమ వాహనాన్ని వెనక్కి తిప్పుకుని వెళ్లే ప్రయత్నం ఈఎస్ఐ హాస్పటల్ వద్ద చేశారు. దీంతో అప్రమత్తమైన పోలీసులు వారిని వెంబడించి పట్టుకున్నారు. ప్రాథమిక విచారణలతో వారు ప్రయాణిస్తున్న వాహనంతో పాటు మరికొన్ని వాహనాలు చోరీ చేసినట్లు నిర్ధారణకు వచ్చారు. వారిని అరెస్టు చేసి వారి నుంచి బైక్‌లు స్వాధీనం చేసుకున్నారన్నారు. పశ్చిమగోదావరి జిల్లా భీమవరానికి చెందిన షేక్ బాషా (35), ఉండికి చెందిన జక్కంశెట్టి దుర్గాప్రసాద్ (26), విజయవాడ వాంబేకాలనీకి చెందిన సయ్యద్ యూసఫ్ (28)ను అరెస్టు చేసి మీడియా ఎదుట హాజరు పర్చారు. సీఐ ప్రకాష్, ఎస్ఐ ఏవీ శ్రీనివాస్, కానిస్టేబుల్స్ సీహెచ్ రమేష్, ఎం సుభాష్ కుమార్, ఏ తరుణ్ కుమార్ వర్మను సీపీ ఎస్వీ రాజశేఖర్ బాబు, ఇన్‌చార్జ్ డీసీపీ కె.జి.వి.సరిత అభినందించారన్నారు.



ఎలక్ట్రిక్ వాహనాలను చోరీ చేసిన ముగ్గురిని అరెస్టు చేసి మీడియా ఎదుట హాజరుపర్చిన సెంట్రల్ జోన్ ఏసీపీ దామోదర్, మాచవరం సీఐ ప్రకాష్

కృష్ణా వర్సిటీ వీసీ డిగ్రీ పరీక్షా కేంద్రాల పరిశీలన



మచిలీపట్నం టౌన్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి) : మచిలీపట్నంలోని డిగ్రీ పరీక్షా కేంద్రాలను కృష్ణా విశ్వవిద్యాలయం ఉపకులపతి కూన రాంజీ మంగళవారం ఆకస్మికంగా పరిశీలించారు. మచిలీపట్నం ఎస్ఎస్ఆర్ డిగ్రీ కళాశాల, విజయానంద డిగ్రీ కళాశాలల కేంద్రాలను సందర్శించారు. విశ్వవిద్యాలయం పరిధిలో 32 పరీక్షా కేంద్రాల్లో రెండో సెమిస్టర్, నాల్గో సెమిస్టర్ పరీక్షలు జరుగుతున్నాయి. రెండో సెమిస్టర్ పరీక్షలకు 12,203 మంది, నాల్గో సెమిస్టర్ పరీక్షలకు 11,169 మంది హాజరవుతున్నారు.



ఒలింపియాడ్‌లో ప్రతిభ చూపిన విద్యార్థులను అభినందిస్తున్న కలెక్టర్ డీకే బాలాజీ

విద్యార్థులకు కలెక్టర్ బాలాజీ అభినందన

మచిలీపట్నం టౌన్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి) : ఒలింపియాడ్‌లో బహుమతులు సాధించిన మచిలీపట్నం శ్రీచైతన్య స్కూలు విద్యార్థులను మంగళవారం కలెక్టర్ డీకే బాలాజీ అభినందించారు. కలెక్టర్ చాంబర్‌లో విద్యార్థులను అభినందించి బహుమతులు అందజేశారు. ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు, మురళీకృష్ణ, రాజేష్, అశోక్, నాగేశ్వరరావు, పద్మ, జయ, మణికంఠ, పద్మ, గాయిత్రి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా వేంకటేశ్వరస్వామి శాంతి కల్యాణం



అవనిగడ్డ రూరల్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి) : పులిగడ్డలోని అలివేలు మంగ రాజ్యలక్ష్మీ సమేత వేంకటేశ్వర స్వామి శాంతి కల్యాణ మహోత్సవం ఆదివారం వైభవంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు అగ్నిహోత్రం ధన్వంతరాచార్య నేతృత్వంలో అర్చకులు విఖనస భక్తిశ్రద్ధలతో స్వామివారి కల్యాణం నిర్వహించారు. ఉత్సవ కమిటీ సభ్యులు మండలి భావన్నారాయణ నేతృత్వంలో నాలుగు వేల మందికి అన్నస మారాధన జరిగింది. ఉపసర్పంచ్ మండలి వెంకటేశ్వరరావు, ప్రముఖులు పాల్గొన్నారు.

అగ్నిప్రమాదాల నివారణ చర్యలపై అవగాహన



వైద్యులు, సిబ్బందికి అవగాహన కల్పిస్తున్న అగ్నిమాపక అధికారులు

చల్లపల్లి, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి) : అగ్నిప్రమాదాలు సంభవించినపుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, మంటలను అదుపు చేయాల్సిన విధానాలపై అగ్నిమాపక అధికారులు ప్రభుత్వాసుపత్రి వైద్యులు, సిబ్బందికి మంగళవారం అవగాహన కల్పించారు. మొవ్వ అగ్నిమాపక అధికారి కె.వెంకటేశ్వరరావు నేతృత్వంలోని సిబ్బంది చల్లపల్లి ప్రభుత్వాసుపత్రిలో డెమో నిర్వహించారు. గ్యాస్‌లీక్ సమయంలో నిలుపుదల చేసే విధానం, మంటలు ఎలా అదుపుచేయాలి అంశాలను వివరించారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ బి.ఎస్.శ్రీనివాస్ పర్యవేక్షణలో వైద్యులు, సిబ్బంది పాల్గొనగా, అగ్నిమాపక సిబ్బంది ఎ.వి.హర్ష చంద్రరావు, జి.శ్రీనివాసరావు, డి.రామకృష్ణ డెమో నిర్వహించారు.



చిన్నారి వైద్యానికి మైత్రి ఫౌండేషన్ రూ.లక్ష సాయం

మచిలీపట్నం టౌన్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి) : మచిలీపట్నం టెంపుల్ కాలనీకి చెందిన ఎండి సుభాని, జెలీనా దంపతులకు జన్మించిన చిన్నారి అత్యవసర చికిత్స నిమిత్తం రూ. 4 లక్షలు కావాల్సి ఉండగా, మైత్రి ఫౌండేషన్ ప్రతినిధులు రూ.లక్ష విరాళంగా అందజేశారు. ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావు చేతుల మీదుగా ఈ మొత్తాన్ని అందజేశారు. కొనకళ్ల నారాయణరావు మాట్లాడుతూ, చిన్నారిని ఆదుకునేందుకు సీఎం రిలీఫ్ ఫండ్‌కు దరఖాస్తు చేస్తున్నామన్నారు. మైత్రి ఫౌండేషన్ వ్యవస్థాపకుడు వేణుకుమార్, కొనకళ్ల బుల్లయ్య, చిలంకుర్తి దీప్తి, అభిజిత్, ప్రసాద్, రాధాకృష్ణ, వి.రమాదేవి పాల్గొన్నారు.



ఇన్‌సెట్‌లో మల్లేశ్వరి (ఫైల్), భౌతికకాయం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే మండలి బుద్దప్రసాద్

టీడీపీ నేత మోర్ల ప్రసాద్‌కు సతీ వియోగం

చల్లపల్లి, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి) : టీడీపీ బీసీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి మోర్ల ప్రసాద్ సతీమణి మల్లేశ్వరి (65) మంగళవారం కన్నుమూశారు. మల్లేశ్వరి భౌతికకాయాన్ని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్, ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావు సందర్శించి నివాళులు అర్పించారు. మల్లేశ్వరి భర్త ప్రసాద్‌ను, కుమారులు, మండల టీడీపీ అధ్యక్షుడు, వైస్ ఎంపీపీ మోర్ల రాంబాబు, జిల్లా తెలుగుయువత ఉపాధ్యక్షుడు మోర్ల శివలను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. యువనేత మండలి వెంకట్రామ్, పారిశ్రామికవేత్త విక్కుర్తి శ్రీనివాసరావు, డీసీ చైర్మన్ నిడమానూరి దిలీప్‌కుమార్, ఏఎంసీ చైర్మన్లు తోట కనకదుర్గ, కొల్లూరి వెంకటేశ్వరరావు, సర్పంచ్ పైడిపాముల కృష్ణకుమారి, ఉపసర్పంచ్ ముమ్మనేని నాని, పైడిపాముల స్వప్న, నబీఘోరి, ప్రిన్సిపాల్ నాగళ్ల భీమారావు, యార్లగడ్డ శ్రీనివాసరావు, యాసం చిట్టిబాబు, తలశిల స్వర్ణలత, తాడికొండ చిన్నా, సీఐ ఈశ్వరరావు, వివిధ పార్టీల నేతలు, మల్లేశ్వరి భౌతికకాయానికి నివాళులు అర్పించారు.

చెరకు రైతుకు శాస్త్రవేత్తల సూచనలు



ఘంటసాల, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి) : కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు దేవరకోట గ్రామంలో చెరకు పంటను మంగళవారం పరిశీలించారు. చెరకు జడలు కట్టే దశకు చేరుకుందని, ఈ సమయంలో కాండం తొలుచు పురుగు ఉనికిని, ఉధృతిని గమనించుకోవటానికి లింగాకర్షక బుట్టలను అమర్చుకోవాలని సమన్వయకర్త డా.డి.సుధారాణి తెలిపారు. పురుగు నివారణకు వేప సంబంధిత మందులను పిచికారి చేసుకోవాలని సూచించారు. ఉధృతి అధికంగా ఉన్నప్పుడు ఎసిఫేట్ 1.5 గ్రాములు లేదా క్లోరాంట్రనిలిప్రోల్ మి.లీ లీటరు నీటికి చొప్పున కలుపుకుని పిచికారి చేసుకోవాలని తెలిపారు. శాస్త్రవేత్త రేవతి, ఆదర్శ రైతు రత్నగిరిరావు పాల్గొన్నారు.



ఇంటర్‌లో ప్రతిభ చూపిన హాస్టల్ బాలికలను సత్కరిస్తున్న ఎమ్మెల్యే మండలి



పెడన బంగ్లా స్కూల్ వార్షికోత్సవంలో విద్యార్థుల వేషధారణ



విద్యార్థుల తల్లులతో మాట్లాడుతున్న ఎంఈవో శివశంకర్‌రావు

క్రమశిక్షణతో లక్ష్య సాధనకు కృషి చేయాలి

అవనిగడ్డ, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు లక్ష్యాన్ని నిర్దేశించుకుని ఉన్నత శిఖరాలు అధిరోహించేందుకు కృషి చేయాలని ఎమ్మెల్యే మండలి బుద్దప్రసాద్ అన్నారు. ఇంటర్మీడియట్‌లో ప్రతిభ కనబర్చిన అవనిగడ్డ సాంఘిక సంక్షేమశాఖ బాలికల వసతి గృహం విద్యార్థినులను మంగళవారం ఆయన ఘనంగా సత్కరించారు. ఇంటర్ ద్వితీయ సంవత్సర ఫలితాల్లో 968 మార్కులు సాధించిన ఎంపీసీ విద్యార్థిని నాయుడు శ్యామలీల, 954 మార్కులు సాధించిన కైతేపల్లి మేఘన సంధ్య, ఇంటర్ మొదటి సంవత్సరంలో 420 మార్కులు సాధించిన ఆరేవరపు సాయి నవ్యశ్రీలను ఎమ్మెల్యే ఘనంగా సత్కరించి జ్ఞాపికలు అందించారు. నూరుశాతం ఉత్తీర్ణులు ఉత్తీర్ణత సాధించటంతో పాటు ఎనిమిది మంది విద్యార్థినులు 800 లకు పైగా మార్కులు, పది మంది 700 లకుపైగా మార్కులు, ముగ్గురు 500లకు పైగా మార్కులు సాధించారని, మొదటి సంవత్సరం బైపీసీ 390కిపైగా మార్కులు సాధించటం అభినందనీయమని అన్నారు.

బంగ్లా స్కూల్ వార్షికోత్సవం

పెడన : బంగ్లా స్కూల్ మోడల్ ప్రాథమిక పాఠశాలగా ఎంపికయిందని ఎంఈవో-2 వై.వి. హరనాథ్ తెలిపారు. ఎంతో ప్రఖ్యాతి గాంచిన బంగ్లా స్కూల్ వార్షికోత్సవం మంగళవారం వైభవంగా జరిగింది. హరనాథ్ మాట్లాడుతూ, బంగ్లా స్కూల్ మోడల్ ప్రాథమిక పాఠశాలగా ఎంపికయినందున తరగతికి ఒకరు చొప్పున ఐదు తరగతులకు ఐదుగురు ఉపాధ్యాయులు బోధిస్తారన్నారు. పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షుడు మట్టా రాధాకృష్ణమూర్తి మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాలలో చదువుకున్న ఎంతో మంది ఉన్నత స్థానా ల్లో ఉన్నారన్నారు. తల్లిదండ్రులు ప్రభుత్వ పాఠశాలలను ఆదరించాలని విజ్ఞప్తి చేశారు. వివిధ పోటీలలో విజేతలైన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ప్రధానోపాధ్యాయురాలు జి.భాగ్యలక్ష్మి, ఎస్ఎంసీ చైర్మన్ ఎం.సుధారాణి, వైస్‌చైర్మన్ ఎండీ బాబు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పిల్లలను బడిలో చేర్పించాలి

ఘంటసాల : బడిఈడు పిల్లలను ప్రభుత్వ బడిలో చేర్పించాలని కోరుతూ ఎంఈవో-1 ఎస్.శివశంకర్‌రావు ఆధ్వర్యంలో చిలకలపూడిలో ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్ జరిగింది. టీచర్ కె.రత్నజ్యోతి, సహచర ఉపాధ్యాయుడు జి.భగవాన్‌తో కలిసి చిలకలపూడిలో పర్యటించారు. ప్రభుత్వ పాఠశాల సౌకర్యాలను సద్వినియోగం చేసుకుంటూ పిల్లలను చదివించి ప్రయోజకులను చేయాలని తల్లిదండ్రులకు సూచించారు.



మనబడికి పోదాం కరపత్రాల ఆవిష్కరణ

కోడూరు : కూటమి ప్రభుత్వం నూతనంగా మంజూరు చేస్తున్న జడ్పీ హైస్కూళ్లను సద్వినియోగం చేసుకోవాల్సిన బాధ్యత ప్రజలపై ఉందని ఎమ్మెల్యే మండలి బుద్దప్రసాద్ తెలిపారు. జడ్పీ హైస్కూలుగా అప్ గ్రేడ్ అయిన రామకృష్ణాపురం స్కూల్‌లో మనబడికి పోదాం కార్యక్రమాన్ని ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేసి ప్రారంభించారు. కరపత్రాలు, వాల్ పోస్టర్లు ఆవిష్కరించారు. తూర్పుకృష్ణా ప్రాజెక్టు కమిటీ చైర్మన్ దేవనబోయిన వెంకటేశ్వరరావు, దాత నడిపల్లి వెంకట చినరాజు, ఎంపీడీవో జి.సుధా ప్రవీణ్, నాయకులు అద్దంకి పాండురంగారావు, ఎంఈవోలు టివిఎం.రాందాసు, వి.శ్రీనివాసరావు, ఏపీవో రవికుమార్, ఎస్ఎంసీ చైర్‌పర్సన్ అద్దంకి ఉష, హెచ్ఎం నాగార్జున, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కలెక్టరేట్ వద్ద ఆక్రమణల తొలగింపు



పటిష్ట భద్రత మధ్య ఆక్రమణలు తొలగిస్తున్న కార్పొరేషన్ సిబ్బంది

మచిలీపట్నం టౌన్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి) : కలెక్టరేట్ ప్రహరీని ఆనుకుని ఉన్న ఆక్రమణలను మంగళవారం కార్పొరేషన్ టౌన్ ప్లానింగ్ అధికారులు తొలగించారు. ఆక్రమణలను తీసివేయాలని కార్పొరేషన్ అధికారులు వరుసగా నోటీసుల మీద నోటీసులు ఇచ్చినా ఆక్రమణదారుల్లో చలనం లేదు. నగరంలో నెల రోజుల నుంచి ఆక్రమణలను తొలగిస్తున్న మున్సిపల్ అధికారులు మంగళవారం కలెక్టరేట్ ప్రహరీ వెంబడి ఉన్న ఆక్రమణలపై దృష్టి సారించారు. మునిసిపల్ కమిషనరు బాపిరాజు, టౌన్ ప్లానింగ్ ఆఫీసరు హరిప్రసాద్ ఆధ్వర్యంలో ఆక్రమణలను తొలగించడంతో కొద్ది సేపు ఉద్రిక్త వాతావరణం నెలకొంది. పోలీసులు రంగంలోకి ప్రవేశించడంతో వివాదం సద్దుమణిగింది.



వినతిపత్రం అందజేస్తున్న ఎంపీటీసీ సభ్యులు, సర్పంచి

చేతిపంపులు ఏర్పాటు చేయాలి

నాగాయలంక, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి) : పంట కాల్వలకు వదిలిన నీటితో రక్షిత మంచినీటి చెరువులను పూర్తిగా నింపుకోవాలని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ కిషక్షర్ పంచాయతీ కార్యదర్శులను కోరారు. మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఎంపీపీ భోగాది రాఘవరాణి అధ్యక్షతన మంగళవారం జరిగింది. ఎంపీడీవో జి.సుధాప్రవీణ్ ఆయా శాఖల పనితీరును సమీక్షించారు. ఈ నెలాఖరు వరకు పంట కాల్వలకు తాగునీరు విడుదలవుతుందన్నారు. రక్షిత మంచినీటి చెరువులను నింపి వేసవిలో తాగునీటి సమస్య లేకుండా చూడాలని ఏఈ కోరారు. వ్యవసాయ, ఉపాధి, పశుసంవర్థక, మత్స్య, ఆరోగ్యం, వెలుగు, ఐసీడీఎస్, ఆర్టీసీ, పంచాయతీరాజ్, గృహ నిర్మాణ, అటవీ శాఖ అధికారుల పనితీరును ఎంపీడీవో సమీక్షించారు. భావదేవరపల్లి శివారు కుమ్మరిపాలెం గ్రామానికి శ్మశాన భూమి కేటాయించాలని సర్పంచ్ మండలి ఉదయ భాస్కర్ వినతిపత్రాన్ని అందించారు. దిండి, గణపేశ్వరం, సొర్లగొంది, గుల్లలమోద గ్రామాల్లో తాగునీరు కోసం చేతి పంపులు ఏర్పాటు చేయాలని ఎంపీటీసీ సభ్యులు కొల్లాటి లక్ష్మీ, విశ్వనాథపల్లి లక్ష్మీనాంచారమ్మ, నాగిడి ఆదిలక్ష్మి వినతిపత్రాలు అందజేశారు. మూడు సంవత్సరాలుగా ఎంపీటీసీ సభ్యులకు గౌరవ వేతనాలు రావటం లేదంటూ నాగాయలంక ఎంపీటీసీ సభ్యులు-2 లంకే శ్రీనివాస ప్రసాద్ ఎంపీడీవోకు వినతిపత్రాన్ని అందించారు. మండల ఈవోపీఆర్డీ కె.అప్పల నరసమ్మ పర్యవేక్షించారు.



ఉపాధి కూలీల సమస్యలు తెలుసుకుంటున్న సీపీఎం నేత రాజశేఖర్

ఉపాధి వేతన బకాయిలు చెల్లించాలి

చల్లపల్లి, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి) : ఉపాధి కూలీలకు పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు యద్దనపూడి మధు డిమాండ్ చేశారు. వక్కలగడ్డలో పర్యటించి కూలీలతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మహమ్మద్ కరీముల్లా తదితరులు పాల్గొన్నారు. **ఘంటసాల** : ఉపాధి కూలీలకు వేతన బకాయిలను వెంటనే ప్రభుత్వం చెల్లించాలని వ్యవసాయ కార్మిక సంఘం నేతలు మేడంకి వెంకటేశ్వరరావు, వాకా రామచంద్రరావు డిమాండ్ చేశారు. ఘంటసాలపాలెంలో ఉపాధి పనులను పరిశీలించి సమస్యలను నేతలు అడిగి తెలుసుకున్నారు. ఉపాధి కూలీలకు కచ్చితంగా 100 రోజుల పని కల్పించాలన్నారు. గొరుముచ్చు వెంకటేశ్వరరావు, కూలీలు పాల్గొన్నారు. **మోపిదేవి** : ఉపాధి పనిదినాల సంఖ్యను 200ల రోజులకు పెంచాల్సిందిగా సీపీఎం నేత రాజశేఖర్ డిమాండ్ చేశారు. వెంకటాపురంలో ఉపాధి పనులను పరిశీలించి కూలీలతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. కమిటీ సభ్యుడు కొమ్ము జయరావు పాల్గొన్నారు.



రామానగరంలో గర్భిణులకు సీమంతం చేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

ముగిసిన పోషణ్ పక్వాడా కార్యక్రమాలు

చల్లపల్లి, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి) : ఐసీడీఎస్ ఆధ్వర్యంలో చేపట్టిన పోషణ్ పక్వాడా కార్యక్రమాలు మంగళవారం ముగిశాయి. రామానగరం ఒకటో అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులకు సామూహిక సీమంతం నిర్వహించారు. సూపర్‌వైజర్ విశ్రాంతమ్మ, న్యాయవాది సరస్వతి, మహిళా పోలీస్ దుర్గాభవాని, ఏఎన్ఎం శ్రీదేవి, ఎంఎల్‌హెచ్ పావని, వార్డుసభ్యుడు రమేష్, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు. చల్లపల్లి 13వ అంగన్‌వాడీ కేంద్రంలోలో సూపర్‌వైజర్ సిహెచ్.ఆదిలక్ష్మి, మహిళా పోలీసు సైకం నాగలక్ష్మి, ఎంఎల్‌హెచ్‌సపీ ఏ.సునీత, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు. తల్లులు, బాలింతలకు పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. **ఘంటసాల** : కృషి విజ్ఞాన కేంద్రంలో నిర్వహించిన పోషణ్ పక్వాడా కార్యక్రమం మంగళవారంతో ముగిసింది. ముఖ్యఅతిథిగా పాల్గొన్న గుంటూరు లామ్ సామాజిక కళాశాల రిటైర్డ్ డీన్ డాక్టర్ సిహెచ్.చిరంజీవి విచ్చేసి గర్భిణులు, బాలింతలు, పిల్లలకు రెండు సంవత్సరాలు వచ్చే వరకు తీసుకోవాల్సిన పోషకాహారం జాగ్రత్తలను వివరించారు. ప్రోగ్రామ్ కో-ఆర్డినేటర్ డాక్టర్ సుధారాణి శాస్త్రవేత్తలు జి.కృష్ణవేణి, మంజువాణి, జె.యశ్వంత్ కుమార్, కె.రేవతి, నవీన్, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు, రైతులు పాల్గొన్నారు. **పెడన** : అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందించే పౌష్టికాహారంతో ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సీనియర్ కౌన్సిలర్ కటకం ప్రసాద్ సూచించారు. ఎనిమిదో వార్డులోని అంగన్‌వాడీ కేంద్రం లో పోషణ పక్వాడా పక్షోత్సవాల ముగింపు కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. కటకం ప్రసాద్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. పౌష్టికాహార పదార్థాల స్టాల్‌ను ఏర్పాటు చేశారు. ఎంఈవో-2 వై.వి.హరనాథ్, పీహెచ్‌సీ వైద్యాధికారిణి మీనాదేవి, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ కల్పవల్లి, కార్యకర్తలు పాల్గొన్నారు.



మినుములో సమయానుకూల సస్యరక్షణ కీలకం

చల్లపల్లి, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి) : మినుము పంటలో సమయానుకూల సస్యరక్షణ కీలకమని ఘంటసాల కృషి విజ్ఞాన కేంద్రం సమన్వయకర్త డాక్టర్ సుధారాణి అన్నారు. వక్కలగడ్డ గ్రామంలో వేసవిలో సాగుచేస్తున్న మినుము పంటను కేవీకే శాస్త్రవేత్తలు డాక్టర్ సుధారాణి, డాక్టర్ రేవతి పరిశీలించారు. ప్రస్తుత కాలంలో అధిక ఉష్ణోగ్రత కారణంగా మినుము పంటలో రసం పీల్చే పురుగుల ఉధృతి అధికంగా ఉంటుందన్నారు. ముఖ్యంగా పల్లాకు తెగులు వ్యాప్తికి కారణమైన తెల్ల దోమను అదుపుచేసేందుకు ఇమిడాక్లోప్రిడ్ 0.3 మి.లీ లేదా అసిటామ్రిప్రిడ్ 0.2 గ్రా, లేదా థయోమిథాక్సం 0.2 గ్రాములు లీటరు నీటికి చొప్పున కలుపుకుని పిచికారీ చేసుకోవాలని రైతులకు సూచించారు. గ్రామ వ్యవసాయ సహాయకులు సాయిచందు, రైతులు పాల్గొన్నారు.

విజ్ఞాన విహార్ స్నాతకోత్సవం



అవనిగడ్డ, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి) : విజ్ఞాన విహార్ స్నాతకోత్సవం పాఠశాలలో ఉత్సాహంగా జరిగింది. విద్యార్థులను ఉన్నత తరగతికి ప్రమోట్ చేస్తూ జరిగిన స్నాతకోత్సవంలో ఎస్‌వీఎల్ కళాశాల కరస్పాండెంట్ దుట్టా ఉమామహేశ్వరరావు, ఎంఈవో అన్నపరెడ్డి పిచ్చియ్య అతిథులుగా పాల్గొన్నారు. దుట్టా మాట్లాడుతూ విలువలు మెరుగుపడేలా విద్యాబోధన సాగించాలని సూచించారు. ప్రిన్సిపాల్ నాగసూర్యతేజ పాల్గొన్నారు.

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్‌బర్డ్	120, 129, 140
చికెన్ విత్ స్కిన్	226
చికెన్ స్కిన్‌లెస్	236

నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 420

మూన్నాళ్ల ముచ్చటగా ఆర్‌అండ్‌బీ రహదారి

తోట్లవల్లూరు, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి) : తోట్లవల్లూరులో రూ. 40 లక్షలతో ఇటీవల నిర్మించిన ఆర్‌అండ్‌బీ తారురోడ్డు నాణ్యతా లోపాలతో రోజుల వ్యవధిలోనే ధ్వంసమైంది. రెండు నెలల క్రితం తోట్లవల్లూరులోని పెట్రోల్ బంకు నుంచి బందరు కాలువ వంతెన వైపు కిలోమీటరు పైగా తారురోడ్డు నిర్మించారు. బారీ ఇసుక లోడ్‌తో లారీలు తిరగటంతో రహదారి ధ్వంసమైపోతుందని ప్రజలు చెబుతున్నారు. ఓ ప్రదేశంలో రహదారిపై గొయ్యి పడింది. దీంతో రాత్రి సమయాల్లో ద్విచక్రవాహనదారులు రాకపోకల సమయాల్లో ప్రమాదాలకు గురువుతన్నారు. రహదారి ధ్వంసమైన చోట మరమ్మతులు చేసి ప్రమాదాలను నివారించాలని ప్రజలు కోరుతున్నారు.



ధ్వంసమైన ఆర్‌అండ్‌బీ రోడ్డు

ముగిసిన సీతారాముల కల్యాణ మహోత్సవాలు

గుడివాడ, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి) : స్థానిక కాకర్ల వీధిలోని రామాలయంలో సీతారాముల కల్యాణ మహోత్సవాలు మంగళవారం అత్యంత వైభవంగా ముగిశాయి. బోసుబొమ్మ సెంటర్‌లోని రామాలయం ప్రాంగణంలో భక్త బృందం ఆధ్వర్యంలో నిర్వహించిన 16వ రోజు కార్యక్రమాలు భక్తులను అలరించాయి. నటరాజ నాట్య కళాశాల విద్యార్థులు నిర్వహించిన కూచిపూడి, జానపద, భక్తి గీతాల సాంస్కృతిక నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది. ఈ సందర్భంగా భక్తబృందం కళాకారులకు బహుమతులను అందజేశారు.



రాజనరసింహను కలిసిన దళిత నాయకులు

తెలంగాణ మంత్రిని కలిసిన దళిత సంఘాల నాయకులు

గుడివాడ : గుడివాడలో జరిగిన ఓ ప్రైవేట్ ఫంక్షన్‌కు హాజరైన తెలంగాణ రాష్ట్ర వైద్యఆరోగ్యశాఖ మంత్రి, మాజీ డిప్యూటీ సీఎం దామోదర రాజనరసింహను మంగళవారం స్థానిక దళిత సంఘాల నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలందించారు. సుధాకర్, జయరాజు, అద్దంకి మాణిక్యాలరావు, కలపాల బాబురావు, కొదమల గంగాధర్‌రావు, దొండపాటి రాంబాబు, అప్పికట్ల స్మిత్ పాల్గొన్నారు.

మట్టి నమూనా కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

● ఏడీఏ నిమ్మగడ్డ రమాదేవి

గుడివాడ రూరల్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): గుడివాడలోని భూసార పరీక్షా కేంద్రంలో మట్టి నమూనాలు పరీక్షించటానికి త్వరలోనే పనులు ప్రారంభిస్తున్నామని, ఈ కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఏడీఏ నిమ్మగడ్డ రమాదేవి పేర్కొన్నారు. మంగళవారం గుడివాడ మార్కెట్ యార్డులో ఉన్న భూసార పరీక్షా కేంద్రంలోని పాడైన పరికరాలకు మరమ్మతులు చేయించారు. అనంతరం ఏయే పరికరాలు మరమ్మతులు చేయాలి, నూతన పరికరాలు ఎన్ని కావాలనే విషయాలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. విద్యుత్ త్రిబుల్ ఫేజ్ ఏఏ సెక్షన్లలోకి వస్తున్నాయి, ఖరీదైన మిషనరీలు ఏ విధంగా ఉన్నాయనే విషయాలను ఏవోలను అడిగి తెలుసుకున్నారు. కొన్ని మండలాల నుంచి మట్టి నమూనాలు వస్తున్నందున యుద్ధప్రాతిపదికన అన్ని సిద్ధం చేసుకుని ఉండామన్నారు. ప్రతి మండలంలోని మట్టి నమూనాలు అన్ని గుడివాడ మార్కెట్ యార్డు భూసార పరీక్షా కేంద్రానికి వస్తాయని తెలిపారు. ఏవో ఎస్‌టీఎల్.గుమ్మడి సురేష్, గూడపాటి శ్రీదేవిలకు పలు సూచనలు సలహాలు అందించారు. పరికరాలు పరిశీలించి చిన్న చిన్న మరమ్మతులు ఉంటే వెంటనే టెక్నీషియన్లను పిలిపించి పనులు చేయించాలని కోరారు. ప్రతి సెక్షన్‌లో ఎంతమంది సిబ్బంది కావాలి, ఎంతమంది లేబర్ అవసరమవుతారని అంచనాలు రూపొందించుకున్నారు. వ్యవసాయశాఖ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.



ఏవోలకు సూచనలిస్తున్న ఏడీఏ రమాదేవి

నిరుపేదలకు సీఎం రిలీఫ్ ఫండ్ ఆర్థిక సాయం

గుడివాడ, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి) : పేదలకు సీఎం సహాయనిధి ద్వారా ఆర్థిక చేయూత అందుతుందని ఎన్టీఆర్ స్టేడియం కమిటీ ఉపాధ్యక్షులు యలవర్తి శ్రీనివాసరావు అన్నారు. మంగళవారం స్థానిక ప్రజావేదికలో 11వ వార్డుకు చెందిన వాసం అనుదీపికకు రూ.60 వేలు, రూరల్ మండలం బిళ్లపాడుకు చెందిన ఆశ్వర్థతి వర సంధ్యకు రూ.60వేల సీఎం రిలీఫ్ ఫండ్ ఎల్‌వోసీలను అందజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ డైరెక్టర్ గోకవరపు సునీల్, టీడీపీ నాయకులు జగన్మోహనరావు, రాంబాబు, సయ్యద్ జబీన్, షేక్ మౌలాలీ, షేక్ కరీముల్లా, మోజెస్, చిన్న, తదితరులు పాల్గొన్నారు.



ఎల్‌వోసీలను అందజేస్తున్న టీడీపీ నాయకులు

దోసపాడు చానల్‌ను పరిశీలించిన డీసీ చైర్మన్

నందివాడ, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): మంచినీటి చెరువులకు నీళ్లు పెట్టేందుకు మంగళవారం దోసపాడు కాలువ ద్వారా నీళ్లు రావటంతో మండల డీసీ చైర్మన్ బి.ఏసుబాబు, ఉపాధ్యక్షులు ఎన్.రాకేష్, ఏఈ పవన్ కాలువను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా నందివాడ వద్ద పాత డ్రాప్ ఇరుకుగా ఉండటంతో ఆ డ్రాపును పొక్లెయిన్‌తో పడగొట్టారు. ఈ డ్రాప్ వల్ల నందివాడ దాటని నీళ్లు ఇప్పుడు ఆ పరిస్థితి లేకుండా క్రిందకు కాలువ ద్వారా నీళ్లు స్పీడుగా వెళ్తాయని ఏసుబాబు తెలిపారు. అదేవిధంగా కాలువ వెంబడి చేపల చెరువుల తూములను కట్టి వేశామన్నారు. నందివాడ వద్ద డ్రాప్ పడగొట్టడంతో శివారు గ్రామాలకు మంచినీటి (పంచాయతీ) చెరువులకు నీళ్లు సులభంగా అందుతాయన్నారు. అదే విధంగా గ్రామాల్లో పంచాయతీ అధికారులు మంచినీటి చెరువులను నింపుకోవాలన్నారు.



దోసపాడు చానల్‌ను పరిశీలిస్తున్న డీసీ చైర్మన్ బి.ఏసుబాబు

వక్ఫ్ చట్ట సవరణకు వ్యతిరేకంగా శాంతి ర్యాలీ

గుడ్లవల్లేరు, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి) : పార్లమెంటులో ప్రవేశపెట్టిన వక్ఫ్ చట్ట సవరణను వ్యతిరేకిస్తూ గుడ్లవల్లేరు మండల ముస్లిం సమాజం ఆధ్వర్యంలో మంగళవారం శాంతి ర్యాలీ నిర్వహించారు. గుడ్లవల్లేరు పాత ఎమ్మార్వో కార్యాలయం వద్ద గాంధీ విగ్రహం వద్ద నుంచి ప్రారంభమైన ర్యాలీ ఎంఅండ్‌కే రహదారి మీదుగా ప్రధాన కూడలి నుంచి తహసీల్దారు కార్యాలయం వరకు కొనసాగింది. తొలుత గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. వందలాదిగా ముస్లిం మహిళలు, చిన్నపిల్లలతో సైతం మండుటెండలో నిరసన ర్యాలీలో పాల్గొన్నారు. జాతీయ జెండాలు చేతబూని, నిరసనకు నల్లజజెండాల ప్రదర్శన చేశారు. వీరి నిరసనకు కమ్యూనిస్ట్ సంఘాలు, వైసీపీ నాయకులు సంఘీభావం తెలిపారు. తహసీల్ధారు లోకరాజుకు మైనార్టీ నేతలు వినతిపత్రాన్ని అందజేశారు.



శాంతిర్యాలీలో పాల్గొన్న ముస్లింలు

ఉపాధి హామీ కూలీలకు మౌలిక వసతులు కల్పించాలి

కూచిపూడి, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): ఉపాధిహామీ పథకం కూలీలకు పని ప్రదేశంలో కనీస సౌకర్యాలైన మెడికల్ కిట్లు, మంచినీరు, షామియానా వంటి వసతులు కల్పించకపోవటం వల్ల కూలీలు ఇబ్బందులు పడుతున్నారని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు శీలం నారాయణరావు పేర్కొన్నారు. కాజలో ఉపాధి కూలీల పని ప్రదేశాన్ని సీపీఎం నేతల బృందం పర్యటించి కూలీలు పడుతున్న ఇబ్బందులు అడిగి తెలుసుకున్నారు. మూడు వారాలుగా పని చేస్తున్న కూలీలకు వేతనాలు చెల్లింపు జరగ లేదని వివరించారు. ఉపాధి కూలీలకు కనీస వేతనాలు కల్పించాలని, వంద రోజుల పనిదినాలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.

మొవ్వ న్యాయాధికారి బదిలీ

కూచిపూడి, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): మొవ్వ జూనియర్ సివిల్ జడ్జి కం జ్యుడిషియల్ మేజిస్ట్రేట్ ఆఫ్ ఫస్ట్ క్లాస్ కోర్టు సివిల్ జడ్జి జూనియర్ డివిజన్ పి.రాజన్ ఉదయ్ ప్రకాష్ కడప జిల్లాలోని రాజంపేటలో న్యాయస్థానానికి బదిలీ అయ్యారు. ఈ మేరకు మంగళవారం ఆయనకు బదిలీ ఉత్తర్వులు అందాయి. 2022వ సంవత్సరంలో మొవ్వ న్యాయస్థానానికి న్యాయమూర్తిగా ఆయన విచ్చేశారు. కృష్ణా జిల్లాలోని మొవ్వలో ఏర్పాటు చేసిన ఈ న్యాయస్థానానికి రెండో న్యాయాధికారిగా సేవలందించారు.

వికలాంగులకు భోజనవసతి

గుడివాడ : స్థానిక శిరీష రిహాబిలిటేషన్ సెంటర్‌లోని మానసిక వికలాంగులకు శ్రీకృష్ణ యాదవసేవాసంఘం ఆధ్వర్యంలో నున్న సుబ్బారావు వర్ధంతి సందర్భంగా నున్న వెంకటేశ్వరరావు, మనుమలు బాలాజీ, జ్యోతిర్మయిలు మంగళవారం భోజన వసతి కల్పించారు. హరికుమార్, తిరుపతయ్య, రామచంద్రరావు, తాతారావు, హరిబాబు పాల్గొన్నారు.

విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలి

గుడివాడ, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలంటే కృషి, పట్టుదల, అంకితభావంతో పనిచేయడం నేర్చుకోవాలని ఏఎన్ఆర్ కళాశాల పాలకవర్గ కార్యదర్శి కె.ఎస్ అప్పారావు పేర్కొన్నారు. మంగళవారం స్థానిక కళాశాల ఆడిటోరియంలో 2023-25 ఎంబీఏ బ్యాచ్ వీడ్కోలు కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు నైతిక విలువలను మరచిపోరాదన్నారు. నిర్ధేశిత లక్ష్యాలను సాధించడం కోసం సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకోవాలన్నారు. వ్యాపారవేత్తలుగా ఎదిగి దేశాభివృద్ధిలో పాలుపంచుకోవాలన్నారు. అనంతరం విద్యార్థుల నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో పాలకవర్గ అధ్యక్షులు ఎల్ఆర్‌కే ప్రసాద్, ప్రిన్సిపాల్ డాక్టర్ పి.జె.ఎస్ కుమార్, వైస్ ప్రిన్సిపాల్ బి.ఎస్.ఎస్ పద్మజ, ఎంబీఏ విభాగాధిపతి డాక్టర్ సువర్చల, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



నృత్య ప్రదర్శనలిస్తున్న ఎంబీఏ విద్యార్థులు

పీడీఎస్ గోడౌన్ పరిశీలన

గుడివాడ రూరల్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): ప్రతి నెలా రేషన్ డీలర్లకు సక్రమంగా రేషన్ సరఫరా చేయాలని ఆర్డీవో బాల సుబ్రహ్మణ్యం అన్నారు. మంగళవారం గుడివాడ మార్కెట్ యార్డులోని పీడీఎస్ గోడౌన్‌ను ఆయన పరిశీలించారు. ఏప్రిల్లో ఎన్ని రేషన్‌షాపులకు ఎంత బియ్యం వెళ్లిందీ, ఏయే మండలాలకు ఎంత బియ్యం సరఫరా చేశారో అడిగి తెలుసుకున్నారు. పీడీఎస్ సిబ్బంది నుంచి వివరాలు రాబట్టారు. రేషన్ బియ్యం సరఫరా చేసే సమయంలో జాగ్రత్తగా ఉండాలని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ నాగబాబు, పాల్గొన్నారు.

ఇంటర్న్‌షిప్ సర్టిఫికెట్ల అందజేత

పమిడిముక్కల : వృత్తివిద్య అగ్రికల్చర్ ఇంటర్న్‌షిప్ చేసిన తాడంకి జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల ముగ్గురు పదోతరగతి విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం జారీచేసిన సర్టిఫికెట్లను పాఠశాల హెచ్ఎమ్ వైఎస్ఎన్ ప్రసాద్ మంగళవారం అందజేశారు. 2024- 2025 సంవత్సర పరీక్షల అనంతరం నెలవుల్లో ఒకేషనల్ ఎడ్యుకేషన్‌లో అగ్రికల్చర్ ట్రేడ్‌లో ఇంటర్న్‌షిప్ శిక్షణ పూర్తిచేసుకున్న కె. హేమనాగదుర్గ, ఆరేపు నిహారిక, మొక్క తనుశ్రీలకు సర్టిఫికెట్లు అందజేశారు. సమగ్రశిక్ష జీసీడీవో సీతామహాలక్ష్మి, జిల్లా ఒకేషనల్ కో-ఆర్డినేటర్ సాయిరామ్, ఇన్‌చార్జ్ హెచ్ఎం రవికుమార్ పాల్గొన్నారు.

భూ రీసర్వే ఖచ్చితంగా నిర్వహించాలి

పమిడిముక్కల : భూ సర్వే కార్యక్రమం ఖచ్చితంగా నిర్వహించాలని మండల తహసీల్దార్ నవీన్ కుమార్ పేర్కొన్నారు. మద్రివాడ, లంకపల్లిలో రీసర్వే కొనసాగుతున్న నేపథ్యంలో గ్రామ సర్వేయర్లతో మంగళవారం సమావేశం నిర్వహించి సర్వే చేయాల్సిన పద్ధతులపై అవగాహన కల్పించారు. రీసర్వేలో ఏవిధమైన పొరపాట్లకు తావులేకుండా నిక్కచ్చిగా జరగాలని సూచించారు.

కంప్యూటర్, ప్రింటర్ వితరణ

పామర్రు, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగులైన చిన్నారులకు ఎలకుర్రు కేడీబీ ట్రస్టు అందిస్తున్న సేవలు అభినందనీయమని బందరు యూనియన్ బ్యాంకు ఆర్ఎం కె. వెంకట్రావ్ పేర్కొన్నారు. ఎల్లకుర్రు కేడీబీ ట్రస్టు దివ్యాంగుల పాఠశాలను మంగళవారం నిడుమోలు యూనియన్‌బ్యాంకు మేనేజర్‌తో కలసి ఆయన సందర్శించారు. అనంతరం బ్యాంకు తరుపున ట్రస్టుకు అవసరమైన కంప్యూటర్, ప్రింటర్‌ను వితరణ చేశారు. బ్యాంకు మచిలీపట్నం చీఫ్ మేనేజర్ కె.వరలక్ష్మి, నిడుమోలు బ్యాంకు మేనేజరు వినయ్‌తేజ, ట్రస్టు కార్యదర్శి కాశీనాతథుని నాగేశ్వరరావు పాల్గొన్నారు.

దగ్గుపాటి పురంధేశ్వరి జన్మదిన వేడుకలు

గుడ్లవల్లేరు : గుడ్లవల్లేరులో జిల్లాపార్టీ ఉపాధ్యక్షులు అట్లూరి దిలీప్ కుమార్ గృహంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురంధేశ్వరి జన్మదిన వేడుకలను మంగళవారం నిర్వహించారు. దిలీప్ కుమార్, పార్టీ సీనియర్ నాయకులు గవిర్నేని రామారావులు కేక్‌ను కట్‌చేశారు. గుడివాడ నియోజకవర్గ బీజేపీ కన్వీనర్ సురేంద్రబాబు, మండల పార్టీ అధ్యక్షులు నరేష్ బాబు, ప్రసాద్, పుల్లేటికుర్తి శ్రీనుబాబు పాల్గొన్నారు.

ముగిసిన వేసవి శిక్షణా తరగతులు

గుడ్లవల్లేరు : మేథస్సును వృద్ధిపరుచుకోవడానికి, వ్యక్తిగత గుర్తింపు, మానసిక నియంత్రణకు చెస్‌క్రీడ దోహద పడుతుందని ఆంధ్రప్రదేశ్ చెస్ అసోసియేషన్ పూర్వ అధ్యక్షుడు బొబ్బా వీరబద్రరావు పేర్కొన్నారు. గుడ్లవల్లేరులో ఎ.ఎ.ఎన్.ఎం అండ్ వి.వి.ఆర్.ఎస్.ఆర్ గుడ్లవల్లేరు ఇంగ్లీష్ మీడియం హైస్కూల్లో చెస్ వేసవి శిక్షణా తరగతులు మంగళవారం ముగిశాయి. ఎన్టీఆర్ స్టేడియం జిమ్ కోచ్ వెంకటేశ్వరరావు, ప్రిన్సిపాల్ లీనా, పాఠశాల పీఈటీలు భూపాల శ్రీరెడ్డి, రాధ పాల్గొన్నారు.

యూపీ పాఠశాల ఉపాధ్యాయినికి సన్మానం

గుడివాడ రూరల్, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): బొమ్ములూరు యూపీ పాఠశాలలో పని చేసి పదవీ విరమణ చేసిన జె.నాగకన్య విద్యార్థులకు చక్కటి విద్యను అందించారని మాజీ ఎంపీపీ గుత్తా శివరామకృష్ణ అన్నారు. మంగళవారం బొమ్ములూరు యూపీ పాఠశాలలో పదవీ విరమణ చేసిన నాగకన్యను ఉపాధ్యాయులు, బొమ్ములూరు గ్రామస్థులు, పాఠశాల మేనేజ్‌మెంట్ కమిటీ ఘనంగా సత్కరించింది. పాఠశాల హెచ్ఎం లీలారాణి, విద్యా కమిటీ చైర్మన్ నవీన్, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

వెంకటాద్రిచౌదరి 7వ వర్ధంతి

గుడ్లవల్లేరు : గుడ్లవల్లేరు మండల టీడీపీ అధ్యక్షుడిగా మూడు దశాబ్దాలకు పైగా సేవలందించి, నిరుపేద వృద్ధులకు నిత్యాన్నదానం ఇంటికే క్యారేజ్‌ద్వారా పంపిన సేవా మూర్తి కొసరాజు వెంకటాద్రిచౌదరి(డాక్టర్‌బాబు) అని వేర్‌హౌసింగ్ కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్ రావి వెంకటేశ్వరరావు అన్నారు. వెంకటాద్రిచౌదరి 7వ వర్ధంతి సందర్భంగా కొసరాజు వెంకటాద్రిచౌదరి సేవాసమితి అధ్యక్షుడు రామరాజు నిర్వహణలో మంగళవారం డాక్టర్‌బాబు విగ్రహానికి, ఎన్టీఆర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. మజ్జిగ పంపిణీ చేశారు.

ఈ-కేవైసీ తప్పనిసరి

పామర్రు : రేషన్ పంపిణీ వ్యవస్థలో పారదర్శకతను పెంచేందుకు రేషన్ వినియోదారులు తప్పనిసరిగా ఈ-కేవైసీ చేసుకోవాల్సిందేనని పామర్రు తహసీల్దార్ జి.రవికాంత్ తెలిపారు. మంగళవారం ఆయన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమివేశంలో మాట్లాడారు. ఈ-కేవైసీ చేయించుకోని వారు ఈనెల 30లోగా తప్పనిసరిగా సంబంధిత రేషన్‌డీలర్లవద్దగానీ ఎండీయూ వాహనదారులవద్ద చేయించుకోవాలన్నారు. ఈ-కేవైసీ చేయించుకోని రేషన్ లబ్ధిదారులకు ఎలాంటి ప్రభుత్వ రాయితీలు అందవని ఆయన వివరించారు.

ముగిసిన పోషకాహార పక్షోత్సవాలు

గుడివాడ, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి) : పోషకాహార పక్షోత్సవాల ముగింపు సందర్భంగా స్థానిక ఎన్టీఆర్ కాలనీలోని అంగన్వాడీ సెంటర్లు 1,3లలోది గుడివాడ ఫిషర్‌మెన్ సొసైటీ భవన్‌లో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సూపర్‌వైజర్ నాగజ్యోతి, అంగన్వాడీ కార్యకర్తలు భవాని, సురేఖ, టీడీపీ సభ్యులు రాజేశ్వరరావు, ఏడుకొండలు, ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా మేనేజర్ కె.అశ్లేష, ఏఎన్ఎం మల్లీశ్వరి పాల్గొన్నారు.

గుడివాడ రూరల్ : అంగన్వాడీ కార్యకర్తలు గర్భిణులకు, బాలింతలకు తగిన సూచనలు, సలహాలు అందించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నజీరున్నీసా అన్నారు. మంగళవారం లింగవరం, మోటూరు, బిళ్లపాడు తదితర గ్రామాల్లో పోషణ్ పక్వాడ కార్యక్రమాన్ని నిర్వహించారు.

నందివాడ : గత 15 రోజులుగా పౌష్టికాహార వారోత్సవాల కార్యక్రమాలు అంగన్వాడీ కేంద్రాల్లో నిర్వహిస్తున్నట్టు మండల అంగన్వాడీ సూపర్‌వైజర్ నాగ శిరీష తెలిపారు. చివరి రోజైన మంగళవారం నందివాడ, తుమ్మలపల్లి, వెన్ననపూడి, కుదరవల్లి, రామాపురం, విరివాడ, ఇలపర్రు, లక్ష్మీనరసింహాపురం, వెంకట రామాపురం, నందివాడ సెక్టార్ 4వ అంగన్వాడీ కేంద్రాల్లో ఘనంగా వారోత్సవ కార్యక్రమాలు నిర్వహించారు. అంగన్వాడీ టీచర్లు టి.వెంకటరమణ, ఎన్.సుభాషిణి, సీతామహాలక్ష్మి, రాజేశ్వరి, గర్భిణులు, బాలింతలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

పామర్రు : చిన్నారుల శారీరక ఎదుగుదలకు ప్రభుత్వం అందించే పౌష్టికారాన్ని సద్వినియోగం చేసుకోవాలని పామర్రు ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నూతక్కి సత్యశ్రీ పేర్కొన్నారు. స్థానిక అంగన్వాడి కేంద్రంలో మంగళవారం గర్భిణులకు సీమంతాలు, చిన్నారులకు అన్నప్రాసనలు నిర్వహించారు గ్రామసర్పంచ్ జి.రామలింగేశ్వరరావు, పాల్గొన్నారు.

పమిడిముక్కల : అంగన్వాడీ కేంద్రాల్లో ఈనెల 8 నుంచి కొనసాగుతున్న పోషకాహార పక్షోత్సవం మంగళవారంతో ముగిశాయి. కపిలేశ్వరపురం, చోరగుడి, లంకపల్లి తదితర గ్రామాల్లో నిర్వహించిన కార్యక్రమంలో వైద్యులు, సర్పంచ్‌లు పాల్గొని గర్భిణులు, చంటి పిల్లల ఆరోగ్యం పట్ల తీసుకోవల్సిన జాగ్రత్తలను సూచించారు. డాక్టర్ మేరుగ బాలాజీ, చోరగుడిలో సర్పంచ్ కందిమళ్ల పూర్ణకుమారి, లంకపల్లిలో సర్పంచ్ రత్నకుమారి తదితరులు పాల్గొన్నారు.



గర్భిణులకు సీమంతాలు చేస్తున్న సూపర్‌వైజర్ సత్యశ్రీ